



వేదాయపాలెం చంద్రమౌళినగర్‌లో..

తొలుత తాత్కాలికం.. ఆపై శాశ్వతం

నెల్లూరు నగరంలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి శాశ్వత కట్టడాలు చేస్తున్నారు. భవన నిర్మాణ సమయంలో తాత్కాలిక షెడ్డు నిర్మించి.. అందులో నిర్మాణ సామగ్రి ఉంచుతారు. భవనం పూర్తయిన తరువాత వాటిని తొలగించకుండా అందులో భవనాలకు కాపలాగా ఉండే వాచ్‌మెన్లకు నివాసంగా ఉపయోగిస్తున్నారు. - ఈనాడు, నెల్లూరు

చిన్నపాటి వర్షానికే సింహపురి వణికి పోతోంది. ఈ వారం మూడు రోజులపాటు కురిసిన వర్షాలకు ఇబ్బంది పడిన నగర జనం.. ప్రస్తుతం దోమలతో ఆందోళన చెందుతున్నారు. ఖాళీ ప్రైవేటు స్థలాల నిర్వహణను యజమానులు విస్మరించడంతో వర్షం పడినప్పుడు అందులోకి నీరు చేరి దోమల వృద్ధికి ఆవాసాలుగా మారుతున్నాయి. మలేరియా, టైఫాయిడ్‌కు కారణమయ్యే దోమలు విజృంభిస్తున్నాయి. గత అయిదు నెలల్లో వందలాది మంది టైఫాయిడ్, డెంగీ లక్షణాలతో ఆసుపత్రుల్లో చేరారు.



ఎన్నాళ్లీ దుస్థితి ?


దోమలకు ఆవాస కేంద్రాలుగా ఖాళీ స్థలాలు
ఇతర అవసరాలకు వినియోగిస్తే ప్రయోజనం

ఈనాడు, నెల్లూరు, న్యూస్‌టుడే(టౌన్)

నెల్లూరు నగర శివారు ప్రాంతాల్లో గతంలో వందల సంఖ్యలో స్థలాలు కొనుగోలు చేసి ప్రహరీలు నిర్మించి వదిలేశారు. ఒకప్పుడు నెల్లూరు నగరానికి దూరంగా ఉన్న ఆర్టీసీ కాలనీ, ఆటోనగర్, తల్పగిరికాలనీ, పరమేశ్వరీ నగర్ ప్రాంతాలు ప్రస్తుతం వాణిజ్య, వ్యాపార, నివాస ప్రాంతాలకు కీలకంగా మారాయి. కొందరు ఇక్కడ ఇళ్లు, అపార్ట్‌మెంట్లు నిర్మించుకోగా.. ఇంకా వందల సంఖ్యలో స్థలాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. లకు చెత్త డంపింగ్ కేంద్రాలుగా ఉపయోగపడుతున్నాయి. వర్షం కురిసినప్పుడు ఇందులోకి నీరు చేరి.. దోమల ఉత్పత్తికి అనువుగా మారుతున్నాయి. శివారు ప్రాంతాల్లో దోమలు పెరగడానికి నిర్వహణ లేని ఖాళీ స్థలాలు ఒక కారణమని వైద్యులు చెబుతున్నారు.

చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారు..

లేఅవుట్లకు అనుమతి ఇచ్చిన సందర్భాల్లో పచ్చదనం ఇతర అవసరాలకు నిబంధనల ప్రకారం ఖాళీ స్థలం వదలాలి. ఇక్కడ పార్కు వంటివి అభివృద్ధి చేయాలి. చాలా లేఅవుట్లలో ఖాళీ స్థలం తప్ప అక్కడ ఎలాంటి అభివృద్ధి జరగడం లేదు. చాలాచోట్ల పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం పేరుకుపోయింది. కొన్ని స్థలాలు స్థానిక



నోటీసులు ఇస్తాం

ఖాళీస్థలాల నిర్వహణ పట్టించుకోని యజమానులకు నోటీసులు ఇస్తాం. పట్టించుకోకపోతే.. జరిమానా విధిస్తా. అప్పటికీ స్పందించకుంటే స్వాధీనం చేసుకుంటాం.
– సూర్యతేజ, కమిషనర్

ఇలా చేస్తే ప్రయోజనం

మినీపార్కులు



ఖాళీ స్థలాలను పలు విధాలుగా సద్వినియోగం చేసుకోవచ్చు. తొలుత ఎన్ఎంసీ పరిధిలోని ఖాళీ స్థలాలను గుర్తించి అక్కడ పచ్చదనం అభివృద్ధి చేయాలి. ఒకటి రెండు చోట్ల కాకుండా పెద్ద పెద్ద ఖాళీ స్థలాల్లో మినీ పార్కులుగా తీర్చిదిద్దాలి. ఒకసారి ఏర్పాటు చేసిన తర్వాత స్థానికులే వాటి నిర్వహణ చూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

నిబంధనలు అమలుచేస్తేనే..

నిబంధనల ప్రకారం 200 చదరపు మీటర్ల నుంచి 15 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో చేపట్టే లేఅవుట్లలో ఎన్ఎంసీ పదిశాతం స్థలాన్ని అప్పగించాలి. అందులో పచ్చదనం అభివృద్ధి చేయాలి. క్షేత్రస్థాయిలో అలా జరగడం లేదు. నిబంధనలను అధికారులు తప్పకుండా అమలు చేయాలి.

మురుగునీరు లేకుండా..



ప్రైవేటుకు చెందిన ఖాళీ స్థలాలను ఎవరికి వారు నిర్వహణ చేసుకోవాలి. చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించి శుభ్రంగా ఉంచుకోవాలి. మురుగునీరు బయటకు వెళ్లేలా ఏర్పాట్లు ఉండాలి. ఇలా చేయకుండా వదిలేసిన స్థలాలను గుర్తించి.. వాటి యజమానులకు నోటీసులు జారీ చేయాలి. అప్పటికీ మారకుంటే జరిమానా విధించి చర్యలు తీసుకోవాలి.

నర్సరీలకు డిమాండ్



ప్రైవేటు నర్సరీలకు డిమాండ్ ఉంది. ఖాళీ స్థలాల్లో వీటిని పెంచడానికి అనువుగా మార్చుకోవడం వల్ల ఆదాయంతో పాటు చెత్తాచెదారం నిండిపోకుండా ఉంటుంది. ఖాళీ స్థలాల్లో టేకు, రోజ్‌వుడ్ వంటి మొక్కలు పెంచే వీలు ఉంది. 15- 20 ఏళ్లలో వీటి నుంచి భారీగా ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

జలాశయాల్లో పుష్కలంగా నీటి నిల్వలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: జిల్లాలో రైతుల అవసరాలకు జలాశయాలు, చెరువుల్లో వంద టీఎంసీల నీరు నిల్వ ఉంది. పంటల సాగుకు సిద్ధమవుతున్న తరుణంలో నిల్వలు ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. సోమశిల జలాశయంలో 59.45 టీఎంసీలు, కండలేరులో 36.55, కనిగిరి జలాశయంలో 1.99, నెల్లూరు ట్యాంక్‌లో 0.32, నెల్లూరు బ్యారేజీలో 0.25, సంగం బ్యారేజీలో 0.42 టీఎంసీల నీరు ఉంది. సోమశిల జలాశయంలోకి ఎగువ ప్రాంతాల నుంచి 15,373 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



సోమశిల జలాశయంలో నీటి నిల్వ

డీకేలో ఉద్యోగమేళా రేపు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.గిరి ప్రకటనలో పేర్కొన్నారు.


భద్రత.. బాధ్యత..

విధి నిర్వహణలో పోలీసుల ప్రత్యేక చొరవ ● నేటి నుంచి అమరవీరుల వారోత్సవాలు

ఎలాంటి సమస్య వచ్చినా ముందుగా గుర్తుకొచ్చేది పోలీసులే.. సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూసే బాధ్యత వీరిదే. సరిగా సెలవులు ఉండవు. . విధులకే పరిమితం అవుతుంటారు. విధి నిర్వహణలో ఎంతోమంది అసువులు బాసారు. వారి సేవలు స్మరించుకుంటూ.. ఏటా అమరవీరుల వారోత్సవాలు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది 12 మంది పోలీసులు అమరవీరులయ్యారు.

న్యూస్‌టుడే, నెల్లూరు(నేర విభాగం)

జిల్లా వ్యాప్తంగా 11 పోలీసు సర్కిళ్ల పరిధిలో 54 పోలీసు స్టేషన్లు ఉన్నాయి. హోంగార్డుల నుంచి పోలీసు కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఎస్సైలు, సీఐలు, డీఎస్పీలు ఉంటారు. వీరంతా ఒత్తిళ్లు అధిగమిస్తూనే 24 గంటలూ విధుల్లో ఉంటారు. ప్రతి స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వోతో పాటు ఇద్దరు, ముగ్గురు ఎస్సైలు ఉండాలి. నగర పోలీసు స్టేషన్లలో ఎస్సైల కొరత తీవ్రంగా ఉంది. జనాభా ప్రాతిపదికన సిబ్బంది లేకపోవడంతో పోలీసులపై ఒత్తిడి పెరుగుతోంది. దాంతో పాటు పరిధులు ఎక్కువగా ఉండటం, స్టేషన్ ఒక్కటే కావడంతో సంబంధిత స్టేషన్‌లో విధులు నిర్వర్తించాలంటే పోలీసులు భయపడుతున్నారు. గత ప్రభుత్వంలో పోలీసుల నియామకానికి చర్యలు తీసుకోకపోవడంతో.. శాఖలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. కూటమి ప్రభుత్వమైనా ఖాళీలు భర్తీ చేస్తే సిబ్బందికి ఒత్తిడి ఉండదని పోలీసులు అంటున్నారు.



పోలీసు కవాతు మైదానంలో అమరవీరుల స్తూపం

ప్రాణాలు కోల్పోయిన 12 మంది..

జిల్లా పోలీసు శాఖలో పనిచేస్తున్న 12 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ఈ ఏడాది అనారోగ్య కారణాలు, రోడ్డు ప్రమాదాలు తదితర కారణాలతో మృతి చెందారు. వీరిలో సీఐ రామారావు, ఏఎస్సైలు వైవీ సుబ్రహ్మణ్యం, ఎస్కే రఫీ హకీమ్, హెడ్ కానిస్టేబుళ్లు టి.శ్రీనివాసులు, ఏఆర్ పీసీలు ఎం.రమేష్, వైఎస్ఎం కృష్ణ, టి.వెంకట సుధీర్, జె.హరికృష్ణ, యు.శివకుమార్, పీసీ వై.రమేష్, కాబ్లర్ ఎ.సుబ్రహ్మణ్యం ఉన్నారు.

కుటుంబాలకు అండగా ఉంటాం



పోలీసుల కుటుంబాలకు అండగా ఉంటాం. ఎలాంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే.. పరిష్కారానికి నా వంతు కృషి చేస్తా. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన అన్ని సదుపాయాలు త్వరితగతిన అందేలా కృషి చేస్తాం. ప్రతి శుక్రవారం పోలీస్ సంక్షేమదినం నిర్వహిస్తున్నాం. – జి.కృష్ణకాంత్, ఎస్పీ

31వ తేదీ వరకు..

ఈ నెల 21వ తేదీ నుంచి 31 వరకు పోలీసు అమరవీరుల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ జి.కృష్ణకాంత్ ప్రకటనలో తెలిపారు. విధి నిర్వహణలో అసువులుబాసిన పోలీసుల్ని గుర్తు చేసుకోవడంతోపాటు సమాజంలో కీలకమైన పోలీసుల పాత్ర, విధులు, త్యాగాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశమన్నారు. 21న పోలీసు అమరవీరులకు నివాళులు, 22 నుంచి 31వ తేదీ వరకు సమాజ భద్రత కోసం అసాంఘిక శక్తుల అణచివేత, పోలీసుల త్యాగం, ధైర్య సాహసాల చిత్రాలను జిల్లా వ్యాప్తంగా సినిమా హాళ్లు, స్థానిక కేబుల్ టీవీల్లో ప్రసారం, 26, 27 తేదీల్లో పోలీసుల ఆయుధాలు ప్రదర్శించే ఓపెన్ హౌస్ కార్యక్రమం, 28న రక్తదాన శిబిరాలు, 31న సమైక్యతా పరుగు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అతిక్రమణ.. ఆక్రమణ

ఈ చిత్రంలో కనిపించేది కావలి పట్టణ శివారులోని మద్దూరుపాడు వద్ద జాతీయ రహదారి పైకి చేరిన వర్షపు నీరు. వానొచ్చినప్పుడల్లా రహదారిపై నీరు చేరి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాగులు, వంకల్ని ఆక్రమించడంతో సమస్య తలెత్తింది.



న్యూస్‌టుడే, కావలి

కావలి పట్టణ సమీపంలో ఆక్రమణలు పెరిగి పోతున్నాయి. చెరువులు, కాలువలు, పోరంబోకు భూములు ఆక్రమిస్తున్నారు. ఫలితంగా పరిసర ప్రాంతాల ప్రజలు జలదిగ్బంధానికి గురవుతున్నారు. కావలి మద్దూరుపాడు వద్ద ఓ స్థిరాస్తి వ్యాపారి గత వైకాపా పాలనలో అక్కడి వాగులు, వంకల్ని కబ్జా చేసి.. గోడ నిర్మించుకున్నాడు. దీంతో వర్షం వచ్చినప్పుడల్లా వరద ప్రవాహానికి ఆటంకం ఏర్పడి రహదారిపై చేరుతోంది. వర్షం పడినప్పుడు అధికారులు తాత్కాలిక చర్యలు చేపట్టినా.. శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేయడం లేదు.

● కావలి వైకుంఠపురంలో 20 ఎకరాలకు పైగా ఉండాల్సిన అనపగుంత ప్రస్తుతం పదోవంతు కూడా లేదు. వర్షాలొచ్చినప్పుడల్లా అక్కడి తొలి వీధిలో మోకాలిలోతు నీరు నిలుస్తోంది. ముసునూరులో మర్రిచెట్టు గిరిజనవాసులు సహా బృందావన కాలనీకి ఎదురుగా ఉన్న కొందరి పేదల ఇళ్లు నీట మునుగుతున్నాయి. చెంతనే ఉన్న మందాటి చెరువుకు నీరు వచ్చే.. పొలాలకు నీటిని అందించే పంట కాలువలు కనుమరుగు కావడమే సమస్యకు కారణం.

సర్వేతో సమస్యలు కొలిక్కి

వర్షాలు వచ్చినప్పుడు సమస్యలు తలెత్తకుండా శాశ్వత కార్యాచరణ చేపడతాం. వరదతో ఎవరికీ ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో సర్వే జరుగుతోంది. సర్వే పూర్తైతే సమస్యలు కొలిక్కివస్తాయి.
– శ్రావణకుమార్, కమిషనర్, కావలి

భాషల పరిరక్షణ తప్పనిసరి: వీసీ


పురస్కార గ్రహీతలు

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : భారతీయ భాషలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వీఎస్‌యూ వీసీ విజయభాస్కర్ రావు ఉద్బోధించారు. లేకుంటే భవిష్యత్తులో ప్రమాదంలో పడతాయన్నారు. అఖిల భారత భాషా సాహిత్య సమ్మేళన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా కళాశాలలో సదస్సు చేపట్టారు. పలు రాష్ట్రాల నుంచి వచ్చిన సాహితీవేత్తలకు అవార్డులు, పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో డీకే ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.గిరి, అఖిల భారత భాషా సాహిత్య సమ్మేళన్ జాతీయ అధ్యక్షులు వీరేంద్రసింగ్, ప్రధాన కార్యదర్శి చతుర్వేది, తెలంగాణ అధ్యక్షులు సత్యమూర్తి, కార్యదర్శి చక్రవర్తి, మద్రాస్ విశ్వవిద్యాలయం ఆచార్యులు ఎలిజబెత్ జయకుమారి, ఒడియా కవయిత్రి సుశ్రీసంగీత మిశ్ర, ఆంగ్ల కవి లక్ష్మణరావు, హిందీ రచయిత రామలింగేశ్వరరావు, నారాయణ ఐఏఎస్ అకాడమీ ప్రిన్సిపల్ కె.సరోజినీ దేవి, కవి పెరుగు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమై.. శవమై తేలిన మహిళ


ప్రమీల (పాతచిత్రం)

ఇందుకూరుపేట : ఇంట్లో దంపతుల మధ్య చిన్నపాటి గొడవకు ఆమె మనస్తాపం చెంది సముద్రంలో ఆత్మహత్యకు పాల్పడింది. ఆదివారం ఉదయం మైపాడు బీచ్‌లో మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.... నెల్లూరు కిసాన్‌నగర్‌కు చెందిన అన్నం ప్రమీల(34)కు మణికంఠతో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు ఉన్నారు. శుక్రవారం రాత్రి దంపతుల మధ్య వివాదం జరిగింది. శనివారం భార్య ఇంట్లో కనిపించకపోవడంతో బంధువులు పలుచోట్ల గాలించారు. ప్రమీల మైపాడు బీచ్ కొచ్చి సముద్రంలో మునిగి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సై సంఘటన స్థలానికి చేరుకుని మృతురాలి కుటుంబీకులకు సమాచారమిచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వంతెన.. వంచన

వైకాపా ప్రభుత్వంలో ప్రతిపాదనల్లోనే నిర్మాణాలు ❖ వానొస్తే ఊళ్లు జలదిగ్బంధమే

❖ సంగం మండలం చెర్లోవంగల్లుకు చెందిన షేక్ సర్దార్ 2021 సంవత్సరం నవంబరులో తన ఇంటికి సమీపంలో దువ్వూరు చెరువు కలుజు వాగును దాటే క్రమంలో వరద ఉద్ధృతికి కొట్టుకుపోయి మృతిచెందారు.

❖ ఇటీవల అనంతసాగరం మండలంలో ప్రసవానికి వెళ్లాల్సిన గర్భిణికి కొమ్మలేరు వాగు అడ్డంకిగా మారింది. ఆమెను అక్కడి నుంచి తీసుకెళ్లేందుకు జేసీబీ సాయం తీసుకున్నారు. ❖ నెల్లూరు గ్రామీణం పొట్టేపాళెం వద్ద నెల్లూరు చెరువు కలుజు వాగుపై వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు.

- న్యూస్‌టుడే, సంగం, నెల్లూరు గ్రామీణం


బీరాపేరు వాగు పొంగితే ఇలా రాకపోకలు సాగించాలి (పాత చిత్రం)

వర్షాకాలంలో జిల్లాలో పెన్నానదితోపాటు పలు వాగులు, వంకల ప్రవాహం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోంది. పెన్నానది సోమశిల నుంచి సముద్రం వరకు సుమారు 110 కి.మీ. దూరం పయనిస్తుంది. దానికి ఇరువైపులా ఉన్న పలు వాగులు వర్షాకాలంలో ఉద్ధృతంగా ప్రవహిస్తుంటాయి. చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారిపై తీవ్ర అంతరాయం కలిగించే పైడేరు, పొదలకూరు మండల ప్రాంతంలో కండలేరు, లొడుంవాగు, ఉదయగిరి, కావలి నియోజకవర్గాల పరిధిలోని చిప్పలేరు, పులి, చీకటి తదితర వాగులు ప్రమాదకరంగా ఉన్నాయి. వెంకటగిరి నియోజకవర్గ పరిధిలో సైదాపురం మండలంలో వాగులు రహదారులను జలదిగ్బంధం చేస్తున్నాయి. వాటిని దాటే క్రమంలో ప్రాణాలు కోల్పోతున్నారు.


చెర్లోవంగల్లు సమీపంలో దువ్వూరు చెరువు కలుజు వద్ద వరద ఉద్ధృతి

వీర్లగుడిపాడుకు పెద్ద సమస్య

జిల్లాలో వరద ప్రభావిత గ్రామాల్లో అగ్రభాగంలో ఉండే సంగం మండలంలోని వీర్లగుడిపాడు గ్రామం పెన్నానది, బొగ్గేరు వాగుల మధ్య ఉంది. సోమశిల జలాశయంలో వరద ప్రవాహం దిగువకు విడిచిపెట్టినా, బొగ్గేరు వాగు ఉద్ధృతి పెరిగినా ఈ ఊరు జలదిగ్బంధానికి గురవుతుంది. బొగ్గేరుపై వంతెన నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నా ఫలితం లేదు.

రాకపోలకు సమస్యే

సంగం మండలంలో దువ్వూరు చెరువు నుంచి వరద ప్రవాహం కలుజువాగు ద్వారా కనిగిరి జలాశయానికి చేరుతుంది. దాంతో చెర్లోవంగల్లు జలదిగ్బంధానికి గురవడంతో పాటు జంగాలకండ్రిక, మర్రిపాడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతుంటాయి. బీరాపేరు వాగు ఉద్ధృతితో పెరమన, జంగాలదొరువు గ్రామాల ప్రజలు ఊరు వదిలి వెలుపలకు వచ్చేందుకు వీలుకాదు. తలుపూరుపాడు చెన్నవరప్పాడు మధ్య చవిటి వాగు ఉద్ధృతి పెరిగితే చెన్నవరప్పాడు ప్రజలు ఎటూ కదల్లేరు. చేజర్ల మండలంలో గొల్లపల్లివద్ద పందల వాగు ఉద్ధృతితో చేజర్ల మామూడూరు రహదారిలో రాకపోకలు నిలిచిపోతున్నాయి. రెండేళ్ల క్రితం రూ.తొమ్మిది కోట్ల అంచనాతో నక్కలవాగుపై వంతెన నిర్మించాలని భావించినా అమలు కాలేదు. గంగుంట రహదారిలో పల్లవోలు వాగుదాటే ప్రదేశంలో వంతెన నిర్మాణం కాగితాలకే పరిమితమైంది. చెర్లోవంగల్లు సమీపంలో దువ్వూరు చెరువు కలుజు వద్ద వంతెన నిర్మిస్తే ప్రమాదాలు జరగకుండా ఉంటాయి.

సీఎం జగన్ హామీ ఇచ్చినా..

నెల్లూరు గ్రామీణం పొట్టేపాళెం వద్ద నెల్లూరు చెరువు కలుజు వాగుపై వంతెన నిర్మిస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చారు. 2021లో సీఎం కలుజు వద్దకు వచ్చి వంతెన పరిశీలించారు. అధికారులు రూ.7 కోట్లతో అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. ఇప్పటికీ ప్రతిపాదన దశలోనే ఉండి పోయింది. కూటమి ప్రభుత్వంలోనైనా వంతెనలకు మోక్షం కలుగుతుందన్న ఆశతో జిల్లా ప్రజలు ఉన్నారు.

తనయే.. తనయుడై..!



సంగంకు చెందిన కె.వెంకటేశ్వరరావు(70) అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన అవివాహితుడు. సోదరుడు శ్రీనివాసచౌదరి అంత్యక్రియలు చేయాల్సి ఉంది. ఆయన మోకాలికి శస్త్రచికిత్స చేయించుకుని తిరుపతి బర్డ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. కడసారి వీడ్కోలు పలికి అంత్యక్రియలు ఎవరు చేయాలో సందిగ్ధంగా మారింది. ఆ సమయంలో శ్రీనివాసచౌదరి కుమార్తె డా.పద్మావతి ముందుకొచ్చారు. పెదనాన్నకు తానే కుమారుడిగా సంప్రదాయానుసారంగా ఆదివారం అంతిమయాత్ర చేపట్టి అంత్యక్రియలు పూర్తి చేశారు. **- న్యూస్‌టుడే, సంగం**

తోక జాడిస్తే లోపలేస్తాం: డీఎస్పీ


కౌన్సెలింగ్ ఇస్తున్న నగర డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్లు

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: రౌడీ షీటర్లు తోక జాడిస్తే లోపలేస్తామని నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. నగరంలోని ఆరు పోలీసుస్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీ, సస్పెక్ట్ షీటర్లు, కేడీలు, డీసీలకు ఆదివారం చిన్నబజారు పోలీసు స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఆదివారం మీ పరిధిలోని పోలీసుస్టేషన్‌లో హాజరవ్వాలన్నారు. పంచాయతీలు నిర్వహించడం, రౌడీ కార్యకలాపాలకు పాల్పడడం లాంటివి చేస్తే జైలుకు పంపుతామని హెచ్చరించారు. సమాజంలో గౌరవంగా కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవించాలన్నారు. అలా కాకుంటే జీవితాంతం జైళ్లలో మగ్గాల్సిందేనన్నారు. కార్యక్రమంలో చిన్నబజారు, నవాబుపేట, సంతపేట, దర్గామిట్ట, వేదాయపాలెం, బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ కోటేశ్వరరావు, అన్వర్‌బాషా, మద్ది శ్రీనివాసరావు, రోశయ్య, ఆర్ఎస్ కిశోర్‌కుమార్, సాంబశివరావు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటకుల సందడి

ఉదయగిరి, న్యూస్‌టుడే: పర్యాటకుల సందడితో ఉదయగిరి దుర్గం ఆదివారం కిక్కిరిసింది. కొండపై దారులన్నీ పర్యాటకుల రాకతో రద్దీగా మారాయి. సల్వాపేట్ జలపాతంతోపాటు ప్రకృతి అందాలను ఆస్వాదించేందుకు ఉదయగిరితోపాటు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చారు. చెక్‌డ్యాం, సెలయేర్లల్లో చిన్నాపెద్దా అనే తేడా లేకుండా ఈత కొడుతూ, ఒకరిపై ఒకరు నీటిని చల్లుకుంటూ ఉల్లాసంగా గడిపారు.



అమ్మా.. నాన్న నేనే.. బ్యాగులమ్మాలి చెల్లి

లాలిజో.. లాలిజో.. ఊరుకో చిట్టి తల్లి.. ఏడవకే నా బుజ్జి తల్లి.. అమ్మా.. నాన్నను నేనేలే.. బతుకు పోరులో తప్పదులే.. అంటూ చిరుప్రాయంలో చెల్లిని లాలిస్తూ వ్యాపారం చేస్తోంది ఓ బాలిక. నిరుపేద అయిన ఈమె తన చెల్లిని ఒడిలో పెట్టుకొని సముదాయిస్తూ బ్యాగులు విక్రయిస్తోంది. తల్లిదండ్రులు మరోచోట వ్యాపారం చేస్తుండగా ఈమె ఒక్కటే చెల్లెలితో కలసి ఇలా జీవనపోరాటం చేస్తోంది. ఈచిత్రం నెల్లూరులోని కలెక్టర్ బంగ్లా సమీపంలో ఆదివారం కనిపించగా 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది. ఈప్రాంతంలోని డీకే కళాశాల ప్రాంగణం గోడ నీడలో ఈ బాలిక వ్యాపారం చేస్తోంది.

- నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే





దీపావళి నుంచి ఏటా మూడు సిలిండర్లు ఉచితం

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని దీపావళి పండగ రోజు ప్రారంభించనున్నారు. సూపర్‌సిక్స్ పథకాల హామీల్లో భాగంగా అర్హులకు ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తామని, పథకం అమలుకు ఏడాదికి రూ.3వేల కోట్లు ఖర్చవుతుందని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. సూపర్ సిక్స్‌లో ప్రతి ఇంటికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఇంట్లో నలుగురు కుటుంబ సభ్యులు ఉంటే ఎంత పొదుపుగా వినియోగించినా రెండు నెలలకు ఒకటి చొప్పున ఏటా ఆరు సిలిండర్లు అవసరమవుతాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఏకంగా మూడు సిలిండర్లు ఉచితంగా అందించనుంది. జిల్లాలో ప్రస్తుతం గ్యాస్ బండ ధర రూ.840 (దూరం బట్టి మారుతుంది) ఉంది. కేంద్ర ప్రభుత్వం రూ.10.62 రాయితీగా ఇస్తోంది. అంతిమంగా జనం రూ.829.38 భరించాల్సి వస్తోంది. ప్రభుత్వం ఏటా మూడు సిలిండర్లు ఉచితంగా అందించనుండటంతో వంటింటిపై ఆర్థిక భారం తగ్గినట్లే. ఒక్కో ఇంటికి రూ.2,488.14 ఆదా కానుంది.

జిల్లాలో వివరాలు	
గ్యాస్ కనెక్షన్లు:	7,84,867
రేషన్‌కార్డులు:	7,32,331

యువత నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి


మాట్లాడుతున్న ఆనం రామనారాయణరెడ్డి

సంగం, చేజర్ల, న్యూస్‌టుడే: ఆత్మకూరు నియోజకవర్గంలో యువతలో నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదివారం తెలిపారు. నెల్లూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో జరిగిన సంగం, చేజర్ల మండలాల ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు... యువత ఉపాధి అవకాశాలు పొందాలంటే నైపుణ్యం అవసరమని, ప్రత్యేక కళాశాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆత్మకూరు బీసీ బాలికల ఆశ్రమ కళాశాలను త్వరలో ప్రారంభిస్తామన్నారు. ప్రతి మండలంలో రూ.1.5 కోట్ల ఉపాధి నిధులతో అభివృద్ధి పనులు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. నియోజకవర్గ పరిధిలో ఆలయాల అభివృద్ధికి ఒక్కో ఆలయానికి రూ.అయిదు లక్షల వంతున నిధులు అందిస్తామని చెప్పారు. ప్రతి మండలానికి 50 గోకులాలను మంజూరు చేసినట్లు చెప్పారు. తెదేపా సభ్యత్వ నమోదులో ఆత్మకూరు నియోజకవర్గం రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన పైలట్ నియోజకవర్గాల్లో ఒకటి కావడం విశేషమన్నారు. గ్రామాలవారీగా పార్టీ నాయకులతో చర్చించారు. ఆయనతో పాటు రాష్ట్ర పరిశీలకులు సుఖవాసి శ్రీనివాస్, నాయకులు గిరినాయుడు, ధనుంజయ్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

సౌకర్యాలు లేక.. అభ్యర్థుల అవస్థ


ఎస్ఎస్ఏ కార్యాలయానికి వచ్చిన అభ్యర్థులు

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే: అధికారుల నిర్లక్ష్యంతో నిరుద్యోగులు ఇబ్బందులు పడ్డారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) కాంట్రాక్టు పద్ధతిలో బోధకుల పోస్టుల భర్తీకి ఆదివారం సమగ్ర శిక్షా అభియాన్ కార్యాలయాంలో ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న 498 మంది తరలివచ్చారు. వీరికి టోకెన్ ఇచ్చి వరుసగా పిలవడంతో ఆలస్యమైంది. నిరీక్షించేందుకు కనీసం కుర్చీలు కూడా ఏర్పాటుచేయలేదు. మెట్లు, ఒకటో అంతస్తు వరండా పిట్టగోడపై గంటల తరబడి కుర్చోవాల్సి వచ్చింది. ఒకే ద్వారం వద్ద గుమికూడడంతో అభ్యర్థుల మధ్య తోపులాట జరిగింది. ఈ విషయమై జిల్లా సమగ్రశిక్షా అభియాన్ ఏపీసీ సీహెచ్ ఉషారాణిని వివరణ అడగ్గా ఎక్కువగా అభ్యర్థులు వచ్చారని పేర్కొన్నారు.

అన్నదాతలకు తీరని నష్టం


మొలకెత్తిన వరికంకులు

సీతారామపురం, న్యూస్‌టుడే: ఆరుగాలం శ్రమించి.. పంటచేతికొస్తుందన్న దశలో కురిసిన అకాలవర్షాలు అన్నదాతకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. పెరిగిన పెట్టుబడులకు చాలామంది కర్షకులు వ్యవసాయం వదిలేస్తున్నారు. సీతారామపురం మండలంలో ఈనెల 14 నుంచి కురుస్తున్న వర్షాలకు వరిపంట నేలవాలింది. నాలుగురోజుల పాటు కురిసిన వర్షం... ఒక్కరోజు తెరిపి ఇచ్చినా. .తిరిగి శనివారం పడటంతో నేలవాలిన వరిపంటలో మొలకలొస్తున్నాయి. దీంతో కర్షకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం సైతం వర్షం పడటంతో నేలవాలిన వరిపైరు మొత్తం మొలకవస్తుందని అన్నదాతలు వాపోతున్నారు. జిల్లాస్థాయి అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని రైతులు పాణెం వెంకటసుబ్బారెడ్డి, ఏనుగుల వెంకటసుబ్బయ్య, తదితర రైతులు కోరుతున్నారు. ఈవిషయమై వ్యవసాయాధికారి చెన్నారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా పంటనష్టం వాటిల్లిన రైతుల వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

క్రీడల్లో ప్రతిభావంతులు

పేదింటి బిడ్డలు..

వారంతా గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు.. వ్యవసాయ కుటుంబ నేపథ్యమైనా విద్యలో రాణిస్తూ క్రీడల్లో సత్తా చాటుతున్నారు... జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటుతూ పలు పతకాలు సాధించారు... వ్యాయామ అధ్యాపకుడు వేణుగోపాల్‌రెడ్డి శిక్షణలో మెలకువలు నేర్చుకొని ఆటల్లో చిచ్చర పిడుగుల్లా చెలరేగుతున్నారు. . వాలీబాల్, అథ్లెటిక్స్, ఫెన్సింగ్, క్రికెట్ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మనుబోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల చదువుతున్న విద్యార్థులు. ఇటీవల స్కూల్క్ ఫెడరేషన్ గేమ్స్ అంతర్ జిల్లా క్రీడాపోటీల్లో చక్కగా రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. **- న్యూస్‌టుడే, మనుబోలు**

పేరు | చదువు | ఊరు | తల్లిదండ్రులు, కుటుంబ నేపథ్యం | సాధించిన విజయాలు | లక్ష్యం

పరుగులో ధీరుడు



● సుమంత్ ● సీనియర్ ఇంటర్ ● మనుబోలు మండలం చెర్లోపల్లి ● కురుగొండ హరిబాబు, చిట్టెమ్మ ● వ్యవసాయ కుటుంబం ● చిన్నప్పటి నుంచి క్రీడలపై ఆసక్తి పెంచుకొని పలు పతకాలు సాధించారు. 800 మీటర్ల పరుగు పందెంలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గతేడాది జరిగిన పరుగు పందెం పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. ● ఏరోనాటికల్ ఇంజినీర్

వాలీబాల్‌లో మెరుపులు..



● హమీదా
● సీనియర్ ఇంటర్
● మనుబోలు మండలం వీరంపల్లి
● ఖాదర్‌వలి, షఫియా ● కొయ్య పని
● ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నప్పటి నుంచి వాలీబాల్‌పై మక్కువ పెంచుకుంది. గతంలో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటింది. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు పతకాల సాధనకు సిద్ధమవుతోంది.
● సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

పతకాలు సొంతం



● జాహ్నవి
● సీనియర్ ఇంటర్
● మనుబోలు మండలం వీరంపల్లి
● మధు, శ్రావణి
● వ్యవసాయ కుటుంబ
● పదో తరగతి నుంచి వాలీబాల్ పోటీల్లో వివిధ ప్రాంతాల్లో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపి పలు పతకాలు సొంతం చేసుకుంది. మరింత మెరుగ్గా రాణించేందుకు మెలకువలు నేర్చుకుంటోంది.
● వైద్య వృత్తి

ఫెన్సింగ్‌లో దిట్ట



● తాటపర్తి నాగరాజు
● సీనియర్ ఇంటర్
● మనుబోలు మండలం వీరంపల్లి
● సుబ్బరామయ్య, సుజాత
● వ్యవసాయ కుటుంబం
● ఫెన్సింగ్ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమంగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అనంతపురం జిల్లా నంద్యాలలో నవంబరు 5న జరిగే పోటీల్లో సత్తాచాటేందుకు ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు.
● పోలీసు

సమస్యల పరిష్కారానికి పోరాటం


మాట్లాడుతున్న అపస్ రాష్ట్ర అధ్యక్షుడు మాల్యాద్రి

కావలి, న్యూస్‌టుడే: ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధన కోసం చిత్తశుద్ధితో పోరాటం చేసిన ఘనత అపస్(ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం)కే దక్కుతుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మాల్యాద్రి అన్నారు. ఆదివారం రాత్రి కావలి పట్టణంలోని ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 20వేల మంది, జిల్లాలో రెండున్నర వేల మంది తమ సంఘ కార్యకర్తలు ఉండటం విశేషమన్నారు. కాంట్రిబ్యూటరీ పింఛన్ విధానం (సీపీఎస్) రద్దు చేయాలంటే కేంద్రప్రభుత్వంతో పనిలేదన్నారు. వామపక్ష ఉపాధ్యాయ సంఘాలు సీపీఎస్ రద్దు పేరుతో కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. జీవో నం 117 రద్దు కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అపస్ జిల్లా అధ్యక్షులు రాజగోపాల్, రవికుమార్, మణికందాచారి, వెకంట్, మాల్యాద్రి, రాధయ్య, సునీత, తదితరులు పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య

కల్లూరు, న్యూస్‌టుడే: తనతో కాపురం చేయాలంటూ ఒత్తిడి చేస్తున్న రెండో భార్యను, మూడో భార్య సాయంతో ఓ వ్యక్తి దారుణంగా హతమార్చిన ఘటన వెలుగుచూసింది. వివరాలను కల్లూరు ఏసీపీ ఎ.రఘు ఆదివారం స్థానిక ఠాణాలో వెల్లడించారు. కల్లూరు మండలం లక్ష్మీపురానికి చెందిన భూక్య ప్రసాద్ ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. తల్లాడ మండలం పాయపూర్‌కు చెందిన కల్యాణితో 20 ఏళ్ల క్రితం వివాహం కాగా మధ్యలోనే ఆమెను వదిలేశాడు. ఆ తర్వాత భద్రాద్రి జిల్లా కొత్తగూడేనికి పనినిమిత్తం వెళ్లిన ప్రసాద్ నరసమ్మ(39)ను రెండో పెళ్లి చేసుకుని లక్ష్మీపురంలో కాపురం పెట్టాడు. ఏడాది నుంచి నరసమ్మతో సఖ్యత కొరవడింది. ఈ నేపథ్యంలో నెల్లూరు జిల్లా చల్లాయిపాలెంకు కరెంటు పనికి వెళ్లాడు. అక్కడ నెల్లూరి మల్లేశ్వరితో సన్నిహితంగా ఉంటూ ఆమెను మూడో పెళ్లి చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న నరసమ్మ స్టేషన్‌లో ప్రసాద్ తీరుపై ఫిర్యాదు చేసింది. ఆమెపై కోపం పెంచుకున్న ప్రసాద్ నరసమ్మను హతమార్చాలని పథకం రచించాడు. కొద్ది రోజుల క్రితం కల్లూరు శివారులోని పోట్రు కృష్ణయ్య మామిడి తోటకు పిలిపించాడు. అక్కడ ఆమెతో గొడవపడి తలభాగంలో చేతితో దాడి చేశాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన తర్వాత మల్లేశ్వరి సాయంతో నరసమ్మ మెడకు చీరను బిగించి హతమార్చారు. తర్వాత మృతదేహాన్ని పుల్లపుకుంటలో పడేసి వెళ్లిపోయారు. ఈ ఘటనపై విచారణ చేసిన పోలీసులు హత్యకు పాల్పడిన ప్రసాద్, మల్లేశ్వరిలను అదుపులోకి తీసుకున్నారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాము ధర: (3 శాతం జీఎస్టీ కలిపిన ధర)	రూ. 7,498
సవర ధర:	రూ. 59,984
వెండి గ్రాము :	రూ. 102.30

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతుధర)	129
రిటైల్	151
లేయర్	115
బ్రాయిలర్స్	219
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	249
లేయర్ మాంసం	195
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	140
లేయర్	115
బ్రాయిలర్స్	250
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	276
లేయర్ మాంసం	195

కావలి
• కావలి • ఉదయగిరి • కందుకూరు

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య : పట్టణంలో సాయంత్రం 6గంటలు దాటినా వీధి దీపాలు వెలగడం లేదు. పిల్లలు ట్యూషన్‌కు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటోంది. **- జి.మనోహర్, గుర్రంవారిపాలెం**

సమాధానం : వాతావరణానికి అనుగుణంగా సాయంత్రం వీధి దీపాలు వెలిగే సమయంలో మార్పులు చేస్తాం. **- కె.అనూష, మున్సిపల్ కమిషనర్**

- న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం,

? మండలంలోని అమ్మవారిపాలెం రామాలయం వద్ద మురుగు కాలువలు పూడికతో నిండిపోయాయి. నీరునిలుస్తోంది. **- మహేశ్‌కుమార్**

✓ పారిశుద్ధ్య కార్మికులకు తెలిపి వెంటనే కాలువపూడిక తీయిస్తాను. **- మహేశ్, పంచాయతీ కార్యదర్శి, - న్యూస్‌టుడే, గుడ్లూరు**

భక్తిశ్రద్ధలతో లింగమక్క తిరునాళ్ల

లింగసముద్రం : లింగసముద్రం గ్రామ దేవతైన లింగమక్క తిరునాళ్ల ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ధర్మకర్త అడపా శ్రీనివాసులు ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు, పసుపు,కుంకమలు సమర్పించారు. బలిజపాలెం నుంచి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. **దగదర్తి :** దగదర్తిలోని దుర్గాభవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మహా చండీయాగం నిర్వహించారు. రామలింగేశ్వరునికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు.

శిరస్త్రాణం తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై శివకృష్ణారెడ్డి

సీతారామపురం, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనదారులు వాహనం నడిపేటపుడు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని ఎస్సై శివకృష్ణారెడ్డి సూచించారు. సీతారామపురం అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద ద్విచక్రవాహనదారులకు శిరస్త్రాణం ధరించడంపై ఆదివారం అవగాహన కల్పించారు. ధరించకపోతే జరిమానా వసూలు చేస్తామన్నారు. వాహనాలు నడిపేవారు లైసెన్సులు కలిగి ఉండటంతోపాటు వాహనానికి తప్పనిసరిగా బీమా చేయించాలన్నారు. అనంతరం ఆయన దేవమ్మచెరువు వెళ్లేమార్గంలోని వాగులను పరిశీలించారు. ఆయన వెంట ఏఎస్సై వెంకటసుబ్బయ్య, కానిస్టేబుళ్లు ఉన్నారు.

చదువుల్లో సాటి.. ఆటల్లో మేటి

న్యూస్‌టుడే, కావలి

కావలి పట్టణంలోని వివిధ కళాశాలలకు చెందిన యువతీ యువకులు చదువుతోపాటు క్రీడల్లో, సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందంజలో నిలుస్తున్నారు. గత రెండు రోజులుగా కావలి వేదికగా నిర్వహించిన ఇంటర్ కోలిజేయట్ గేమ్స్ టోర్నమెంట్‌లో ప్రతిభ చూపారు. సేవలు చేస్తున్న యువతులు మహిళలు, బాలికలతోపాటు ప్రజలకు పలు సమకాలీన అంశాల్లో సదస్సులు నిర్వహిస్తూ అందరికీ ఆదర్శప్రాయంగా వ్యవహరిస్తున్నారు. క్రీడా ప్రతిభ, ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ద్వారా సమాజ సేవల్లోనూ ప్రత్యేకత చాటుకుంటున్నారు.

పూజిత అన్నింటా ఘనత



ప్రకాశం జిల్లా మర్రిపూడి మండలానికి చెందిన మూలి పూజిత.. కావలి జవహర్‌భారతి డిగ్రీ కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్నారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఆమె టేబుల్ టెన్నిస్‌లో మేటిగా నిలుస్తున్నారు. తాజాగా నిర్వహించిన ఇంటర్ కోలిజేయట్ గేమ్స్‌లో విశ్వవిద్యాలయ స్థాయిలో ప్రథమ విజేతగా నిలిచారు. చదువు, ఆటలతోపాటు సమాజసేవలోనూ ముందుంటున్నారు. ఇటీవల బెంగళూరులో నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ జాతీయ శిబిరంలో పాల్గొని పలు అంశాలపై మాట్లాడారు. కళాశాలకు మంచి పేరు తీసుకొచ్చారు.

చాందిని పోటీల్లో ఘనకీర్తి



శ్రీకాకుళం జిల్లా పలాస ప్రాంతానికి చెందిన గువ్వాడి చాందిని కావలిలోని సింహపురి విశ్వవిద్యాలయ పీజీ కళాశాలలో ఎంపీఏ రెండో సంవత్సరం చదువుతున్నారు. తాజాగా జరిగిన ఇంటర్ కోలిజేయట్ గేమ్స్‌లో టేబుల్ టెన్నిస్ ఆటలో ద్వితీయ స్థానం సాధించారు. భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ రంగంలో కొలువు సాధించాలనే లక్ష్యంతో ఉన్నారు. పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

క్రీడారత్నం నవదీప్



మత్స్యకారుని కుటుంబానికి చెందిన మీనం గారి నవదీప్.. విడవలూరు మండలం పొన్నపూడి కొత్తూరు గ్రామం. కావలి శ్రీ చైతన్య కళాశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. వివిధ క్రీడా పోటీలకు హాజరై ప్రతిభను చాటుకుంటున్నారు. అక్టోబర్‌లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారు. గత ఏడాది రాష్ట్రస్థాయి పోటీల్లో హేమర్ త్రోలో బంగారు పతకాన్ని సాధించారు. జాతీయస్థాయిలో మహారాష్ట్రలో నిర్వహించిన పోటీల్లో తొమ్మిదో స్థానంలో నిలిచారు. కబడ్డీ స్టేట్‌మీట్‌లో రెండు పర్యాయాలు జట్టుకు నేతృత్వం వహించారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవాలనే తపనతో ముందుకు సాగుతున్నారు.

యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక

లింగసముద్రం, న్యూస్‌టుడే: యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా ఎస్.సూర్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన కార్యకవర్గ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులు ఆర్.వెంకటకృష్ణ, ఎస్.శాంతకుమారి, ప్రధానకార్యదర్శిగా టి.సుధాకర్ రావు, కోశాధికారిగా కె.మహేంద్రలను ఎంపిక చేసినట్లు యూటీఎఫ్ ప్రతినిధులు కిలారి వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతిశర్మ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో సర్పంచి మృతి

ఉలవపాడు, న్యూస్‌టుడే: మండలంలోని బద్దిపూడి గ్రామ సర్పంచి కూనం అనిల్ రెడ్డి(45) అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. కొంతకాలంగా తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్నారు. హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు తెలిపారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరసన

కావలి : పట్టణంలోని పలు ప్రైవేటు విద్యాసంస్థలు ఆదివారం పాఠశాలల్ని నిర్వహించడంపై ఎస్‌ఎఫ్‌ఐ కార్యకర్తలు ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఉన్నతాధికారులు స్పందించి సెలవ దినాల్లో పాఠశాలలను నిర్వహించకుండా చూడాలన్నారు.

పల్లె ప్రగతే ప్రభుత్వ ధ్యేయం

దుత్తలూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి ప్రగతి బాట పట్టించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మండలంలోని దుత్తలూరు, నర్రవాడ, కొత్తపేట పంచాయతీల్లో ఆదివారం నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం శిలాఫలకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం, మాజీ ఎంపీపీ రవీంద్రబాబు, నాయకులు మల్లికార్జున, గురవారెడ్డి, గురవయ్యనాయుడు, భాజపా, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు గ్రామీణం : కందుకూరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. పల్లెపండగ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కోవూరు, పందలపాడు గ్రామాల్లో రూ.34.51లక్షల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. త్వరలో తాగునీటి సమస్యను తీరుస్తామన్నారు. మండలపార్టీ అధ్యక్షుడు నార్నేరోశయ్య, పంచాయతీరాజ్ డీఈ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో రత్నజ్యోతి, తహసీల్దార్ ఇక్బాల్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లాతో మాలేపాటి భేటీ

కావలి : తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసులుతో పార్టీ కావలి నియోజకవర్గ మాజీ బాధ్యుడు మాలేపాటి సుబ్బానాయుడు ఆదివారం భేటీ అయ్యారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఆయన్ను కలిసి నియోజకవర్గానికి సంబంధించి వివిధ అంశాలపై చర్చించారు. భేటీలో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు.

దుర్గం పర్యాటక అభివృద్ధికి కృషి

ఉదయగిరి : ఉదయగిరి దుర్గాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పి.చెంచలబాబుయాదవ్ అన్నారు. స్థానిక తెదేపా నాయకులతో కలిసి ఆదివారం దుర్గం కొండను, సల్వాపేట్ జలపాతాన్ని సందర్శించారు. నాయకులు బయ్యన్న, షేక్ రియాజ్, ఎన్.రాజా తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల్లో సమస్యలు తీర్చాలి

కావలి : టిడ్కో గృహాల సముదాయంలో సమస్యలను పరిష్కరించాలంటూ సీపీఎం నాయకులు నిరసన చేపట్టారు. ఆదివారం కావలి మద్దూరుపాడు వద్ద టిడ్కో గృహాలను సందర్శించారు. ఇళ్ల లీకేజీలపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య, కృష్ణయ్య, తిరుపాల్, మధుసూదన్‌రావు, పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కలిసి పని చేయాలి

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పందలపాడుకు చెందిన 20 కుటుంబాలు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో వైకాపా నుంచి తెదేపాలో చేరాయి. పార్టీలో పాత, కొత్తనాయకులు అందరూ కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

అధ్వాన దారితో అవస్థలు

మండల కేంద్రం గుడ్లూరు నుంచి నరసాపురం-కావలి పోవు మార్గంలో చిన్నచెరువుకట్టపై రహదారి అధ్వానంగా మారింది. తారు తొలగి గుంతలు పడ్డాయి. దీనికి తోడు అంచుల్లో బంకమట్టి ఉండటంతో వాహనాలు పక్కకు తొలిగితే కట్టకిందకు జారుతున్నాయి. మరమ్మతులకు కావాల్సిన నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపుతామని పీఆర్ జేఈ హనుమంతరావు తెలిపారు. **- న్యూస్‌టుడే, గుడ్లూరు**



గుంత..చింత !



ఈ చిత్రంలో కనిపించేది కావలి పట్టణం 34వ వార్డు కళుగోళమ్మ ఆలయం సమీపంలో రోడ్డుపై ఏర్పడ్డ గుంత. కాలువ కల్వర్టు ధ్వంసం కావడంతో ఈ దుస్థితి ఏర్పడింది. ఆ దారిన పోయే వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ విషయమై కావలి పురపాలక కమిషనర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ త్వరలో ఆ గుంతకు మరమ్మతులు చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే, కావలి**

కాలువకు గండి

కలిగిరి చిన్నచెరువుకు నీటిని అందించే వాగుకు సంబంధించిన కాలువ కట్టకు గండి పడటంతో నీరు వృథాగా పోతోంది. చినఅన్నలూరు చెరువు తూము నుంచి నీరు వృథాగా పోతుండటంతో అధికారులు రింగ్‌బండ్ వేయించారు. కుడుములదిన్నెపాడు చెరువు కట్టపై ఉన్న భారీ మర్రిచెట్టు కూలడంతో వేళ్లు పెకిలించుకుని కట్టకు పగుళ్లు ఏర్పడ్డాయి. విషయం తెలుసుకున్న జలవనరులశాఖ ఏఈ శ్రీనాథ్ తగిన చర్యలు తీసుకున్నారు. **- న్యూస్‌టుడే, కలిగిరి**



కలిగిరిలో వృథాగాపోతున్న నీరు

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం

దుత్తలూరు, న్యూస్‌టుడే: బండకిందపల్లిలో కంకర మిల్లు వద్ద పనిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతిచెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. కడపజిల్లా బద్వేలు మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన పెద్దులపల్లి సురేష్(27) గత కొన్ని రోజులుగా కంకర క్రషర్ యంత్రం ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. ఈక్రమంలో ఆదివారం కంకర మిల్లు వద్ద ఉన్న టిప్పరులో నుంచి టైర్లను దించేందుకు సిద్ధమయ్యారు. ఆ సమయంలో అతను ఒక కాలు నేల మీద, మరో కాలును టిప్పర్ టైరు మీద పెట్టి లిఫ్టును పైకి లేపారు. దీంతో విద్యుత్తు తీగలు వాహనాన్ని తగలడంతో విద్యుదాఘాతానికి గురైన అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. అక్కడ పనిచేస్తున్న వారు గమనించి వింజమూరు వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుకాణం దగ్ధం.. రూ.6.5 లక్షల నష్టం

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పోలీసుస్టేషన్ సమీపంలో ఆటో స్పేర్ పార్ట్స్ దుకాణంలో అగ్నిప్రమాదం జరిగింది. వివరాల మేరకు పట్టణానికి చెందిన షేక్‌రఫి ఆటో విడి భాగాల దుకాణం నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి యథావిధిగా దుకాణం మూసి ఇంటికి వెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున దుకాణంలో మంటలు వస్తున్నట్లు స్థానికులు గమనించి యజమానికి సమాచారమందించారు. ఆయన అక్కడికి చేరుకుని విద్యుదాఘాతంతో మంటలు చెలరేగినట్లు గుర్తించారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారమివ్వడంతో వారు మంటలను అదుపు చేశారు. సుమారు రూ.6.5లక్షలు విలువైన వస్తువులు దగ్ధమైనట్లు యజమాని తెలిపారు.



దగ్ధమైన సామగ్రి

దొంగల హల్‌చల్

కావలి : పట్టణంలోని ట్రంకురోడ్డు శాంతినగర్‌కు సమీపంలో రెండు పక్కపక్క దుకాణాల్లో దొంగలు పడ్డారు. ఆదివారం తెల్లవారుజామున సాగర్ సిమెంట్ దుకాణ షట్టర్లను ధ్వంసం చేసి లోనికి వెళ్లారు. రూ.8వేల నగదుతోపాటు రూ.ఏడు వేల విలువైన వెండి నాణేలు దొంగిలించారు. పక్కనే ఉన్న కారుజోన్‌లోకి చొరబడగా అక్కడ నగదు లేక పోవడంతో వెనుదిరిగారు.

మద్యం స్వాధీనం

ఉలవపాడు: మద్యాన్ని అక్రమంగా తీసుకువెళుతున్న కృష్ణాపురానికి చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు. 4ఫుల్, 5 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

కోడిపందెం స్థావరంపై పోలీసుల దాడి

ఉదయగిరి: జి.చెరువుపల్లి అటవీ ప్రాంతంలో జరుగుతున్న కోడిపందెం స్థావరంపై ఆదివారం దాడులు చేసినట్లు ఎస్సై కె.ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ముగ్గుర్ని అదుపులోకి తీసుకోని రూ. 3,300 నగదు, రెండు కోళ్లు, పది బైకులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అమ్మో కుక్క... పీకేస్తోంది పిక్క



టిడ్కో ఇళ్ల వద్ద గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు

న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం

పట్టణంలోని 32 వార్డులతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లోనూ వీటి బెడదతో అల్లాడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుండం కట్ట వీధి, శివాలయం, పోతురాజు మిట్ట, గుర్రంవారిపాలెం, బైపాస్‌రోడ్డు, 60అడుగుల రోడ్డు, కోవూరురోడ్డు, జనార్దనకాలనీ, ఆనందాపురం రోడ్డు, బూడిదపాలెం, మార్కెట్ కూడలి, బండపాలెం, విప్పగుంటరోడ్డు ప్రాంతాల్లో స్వైరవిహారం చేస్తున్నాయి. రాత్రి 7గంటలు దాటితే పిల్లల్ని బయటకు పంపేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారు. ట్యూషన్లకు వెళ్లి వచ్చే పిల్లలు కోసం తల్లిదండ్రులు కర్రలతో ఎదురు వెళ్లి తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. దూర ప్రాంతాలకు వెళ్లి తిరిగి రాత్రి 10గంటలు తరువాత పట్టణంలో బస్సు దిగి ఇళ్లకు వెళ్లే వారికి తీవ్ర అవస్థలు ఎదురవుతున్నాయి.

వీధి కుక్కల బెడదతో కందుకూరు పట్టణ ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కాలనీల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తూ ఒంటరిగా వెళ్లే పిల్లలు, మహిళలపై దాడులు చేస్తున్నాయి. ప్రధాన వీధుల్లో ఉన్న మాంసం దుకాణాల వద్ద వేగంగా వెళ్లే కార్లు, ద్విచక్ర వాహనదారులను వెంబడిస్తున్నాయి.

నిత్యం నాలుగైదు కేసులు

కందుకూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి గత ఆరు నెలలుగా 750 మంది కుక్కకాటు బాధితులు వచ్చారు. ప్రతి రోజు కనీసం నలుగురు లేదా అయిదుగురు ఏఆర్‌వీ(యాంటీ రెబీస్ వ్యాక్సిన్)కోసం ఏరియా ఆసుపత్రికి వస్తుండటం గమనార్హం. గతంలో వీధి కుక్కల బెడద అధికంగా ఉన్నప్పుడు తిరుపతి పశువైద్యశాల నుంచి వైద్య సిబ్బందిని రప్పించి కుక్కలకు కు.ని.ఆపరేషన్లు చేయించారు. గత రెండేళ్లుగా ఆ దిశగా ఎలాంటి ప్రయత్నాలు లేకపోవడంతో వీటి బెడద నానాటికీ అధికమైపోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

కుక్కకాటుకు టీకా తీసుకున్న వారు(నెలల వారిగా)

మే	105
జూన్	111
జులై	135
ఆగస్టు	121,
సెప్టెంబరు	135
అక్టోబరు 19 వరకు	143



నివారణకు చర్యలు తీసుకుంటాం :

పశువైద్యశాల సిబ్బందితో మాట్లాడి పట్టణంలో సంచరిస్తున్న వీధి కుక్కలకు కు.ని. ఆపరేషన్లు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. త్వరలోనే సమస్య పరిష్కరించేందుకు కృషిచేస్తాం.
కె.అనూష, మున్సిపల్ కమిషనర్

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు



అమ్మవారి గ్రామోత్సవం

మనుబోలు, న్యూస్‌టుడే: స్థానిక దేవాంగుల వీధిలో వెలసిన పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం రాత్రి అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసులు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గందల్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించి నైవేద్యాలు సమర్పించారు. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో అమ్మవారు కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడదాం

వెంకటాచలం, న్యూస్‌టుడే: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి మోహన్ రావు తెలిపారు. ప్రభుత్వాల విధానాలపై పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలన్నారు. మండలంలోని గొలగమూడిలో ఆదివారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వెంకటాచలం, మనుబోలు మండలాల కార్యనిర్వాహక కార్యదర్శిగా దేవదానంను ఎన్నుకున్నారు. నాయకులు శ్రీనివాసులు, వెంకటకృష్ణయ్య, అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏపీకేటీడబ్ల్యూఏ నూతన కార్యవర్గం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం ఆత్మకూరులో జరిగింది. సమావేశంలో అధ్యక్ష, గౌరవాధ్యక్షులుగా పెంచలయ్య, తోట వెంకటసుబ్బయ్య, సహ అధ్యక్షుడిగా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు తదితరులను ఎన్నుకున్నారు.

కోడూరు బీచ్‌లో పర్యాటకుల సందడి

తోటపల్లిగూడూరు, మనుబోలు : మండలంలోని కోడూరు సముద్రతీరాన ఆదివారం పర్యాటకులతో సందడి నెలకొంది. సెలవు రోజు కావడంతో అధిక సంఖ్యలో పర్యాటకులు బీచ్‌కు వచ్చి సముద్ర స్నానాలు చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు : 80085 73987, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య : ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నం పల్లిపాలెం నుంచి విద్యుత్తు ఉపకేంద్రానికి వేసిన స్తంభాలు చిన్నపాటి గాలులకే వాలిపోతున్నాయి. –కృష్ణమోహన్, స్థానికుడు

సమాధానం: పరిశీలించి విద్యుత్తు స్తంభాలు వేసేలా చర్యలు తీసుకుంటాం.
– నరసింహులు, డిస్కం ఏఈ.

? విడవలూరులో ఇటీవల కురిసిన వర్షాలకు మురుగు కాలువల్లో పూడిక పేరుకుపోయింది. దోమలతో సతమతమవుతున్నాం.
– స్థానికులు, విడవలూరు

✓ పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం.
– నగేశ్‌కుమారి, ఎంపీడీవో

? పొదలకూరులోని ప్రధాన రహదారిలో రాత్రి సమయాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. చాలా వీధుల్లో రాత్రి, పగలు నిత్యం వెలుగుతున్నాయి. – సుబ్బయ్య, స్థానికుడు

✓ స్విచ్ బోర్డులు దెబ్బతినడంతో నిత్యం వెలుగుతున్నాయి. పరిశీలించి మార్పు చేస్తాం.
– శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి

వరుస చోరీలతో హడల్..!

తరచూ జరుగుతున్నాయని భయాందోళనలో ప్రజలు

● వెంకటాచలం మండలం చెముడుగుంటకు చెందిన మహిళ కాకుటూరులోని శివాలయానికి వచ్చారు. దర్శనం అనంతరం తిరిగి ఆటోలో వెళ్లారు. చెముడుగుంట రోడ్డులో రహదారిపై దిగి గ్రామంలోకి వెళ్తున్నారు. అక్కడే ద్విచక్రవాహనంపై వేచి ఉన్న ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలోని మూడు సవర్ల బంగారు సరుడును లాక్కొని పరారయ్యారు. స్థానికులు వెంబడించగా పవన్ కాలనీలోని పెట్రోలు బంకు వైపు నుంచి పరారయ్యారు.

● పొదలకూరులో ప్రధాన కూడలి వద్ద నివాసం ఉంటున్న జనార్దన్ సొంత పనినిమిత్తం గత నెలలో చెన్నైకు వెళ్లారు. ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. 750 గ్రాముల వెండి, రెండు సవర్ల బంగారు గొలుసు, రెండు ల్యాప్‌టాప్‌లు అపహరించుకెళ్లారు. ఇంటికొచ్చి చూడగా... చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● కాకుటూరు వద్ద ఉన్న జైన్ దేవాలయం రాష్ట్రంలోనే ప్రసిద్ధి. ఇక్కడికి నిత్యం భక్తుల రద్దీతో పాటు కట్టుదిట్టమైన భద్రత ఉంది. రెండు నెలల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు ఆలయ తాళాలు ధ్వంసం చేసి చోరీకి పాల్పడ్డారు. కోల్‌కత- చెన్నై జాతీయ రహదారి ఆనుకొని ఉన్న ఆలయంలో జరిగిన చోరీ ఘటన రాష్ట్రంలో సంచలనంగా మారింది. నిందితుల వద్ద తుపాకులు ఉన్నట్లు గుర్తించారు. అయితే కొన్ని వారాలు గడిచినా ఇప్పటి వరకు నిందితులను గుర్తించలేదు.

న్యూస్‌టుడే, వెంకటాచలం



జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న సర్వేపల్లి నియోజకవర్గంలోని మండలాల్లో తరచూ చోరీలు ప్రజలను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. నియోజకవర్గంలో పలు జాతీయ స్థాయి సంస్థలున్నాయి. వెంకటాచలం మండలం గొలగమూడి వద్ద ఐఐటీటీఎం కళాశాల, అనుపల్లిపాడు వద్ద దివ్యాంగుల శిక్షణ కేంద్రం, సరస్వతీ నగర్‌లో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, కాకుటూరు వద్ద విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, చెముడుగుంట వద్ద విద్యార్థినుల ఇంటర్ కళాశాల, సరస్వతినగర్‌లో రెండు ప్రముఖ విద్యాసంస్థలు ఉన్నాయి. ముత్తుకూరులో మత్స్యకళాశాల, గొలగమూడిలో వెంకయ్యస్వామి ఆలయం, కసుమూరులో మస్తాన్ వలి దర్గాలున్నాయి. వరుస చోరీ ఘటనలతో ఆధ్యాత్మిక కేంద్రాలతో పాటు ప్రముఖ విద్యాసంస్థలు, రహదారి పక్కనే బ్యాంకుల భద్రతపై నీలినీడలు కమ్ముకున్నాయి.

గస్తీ అని చెబుతున్నా...

వెంకటాచలం మండలంలో బుజబుజనెల్లూరు వద్ద నుంచి కృష్ణపట్నం పోర్టు రోడ్డు సుమారు 14 కిలోమీటర్ల వరకు జాతీయ రహదారి ఉంది. జాతీయ రహదారి నుంచి పుంజులూరుపాడు వరకు 20 కిలోమీటర్లు కృష్ణపట్నం పోర్టు రోడ్డు, మనుబోలు మండలంలోనూ జాతీయ రహదారి ఉంది. ఈ మార్గాల్లో వాహనాల రాకపోకలు విస్తృతంగా ఉన్నాయి. రాత్రి వేళల్లో గస్తీ నిర్వహిస్తున్నామని పోలీసులు చెబుతున్నా... క్షేత్ర స్థాయిలో పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

సిబ్బంది కొరత...

నియోజకవర్గంలోని పలు స్టేషన్లలో సరిపడ సిబ్బంది లేరు. సిబ్బంది కొరతే రాత్రి సమయాల్లో గస్తీ నిర్వహించకపోవడానికి కారణమని పలువురు చెబుతున్నారు. ఇటీవల అన్ని స్టేషన్లకు సీఐలతో పాటు, ఎస్సైలను అధికారులు నియమించారు. దీంతో పాటు జిల్లా అధికారులు స్పందించి సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించి చోరీలు, దోపిడీలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో గత మూడు నెలల్లో సుమారు 30 వరకు చోరీలు జరిగాయి. ఇళ్లు, దుకాణాలను లక్ష్యంగా చేసుకుని కొల్లగొడుతున్నారు. తాజాగా పొదలకూరులో బంగారం దుకాణంలో చోరీ యత్నం మరింత ఆందోళన కలిగిస్తోంది.

నియంత్రణకు చర్యలు: సుబ్బారావు, సీఐ, వెంకటాచలం

రహదారిపై, గ్రామాల్లో చోరీల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అదనపు సిబ్బందిని నియమించి గ్రామాలతోపాటు, రహదారిపైనా రాత్రి వేళల్లో పటిష్ఠంగా గస్తీ నిర్వహిస్తున్నాం. ఇటీవల జరిగిన చోరీల్లో నిందితులను పట్టుకుంటాం..

తెదేపా పాలనలోనే అభివృద్ధి



శంకుస్థాపన కార్యక్రమంలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కొడవలూరు, న్యూస్‌టుడే: తెదేపా పాలనలోనే అభివృద్ధి జరిగిందని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. మిక్కిలింపేటలో పల్లెపండగ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఆమె మాట్లాడుతూ రూ.5 లక్షలతో సిమెంట్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. దెబ్బతిన్న మిక్కిలింపేట రోడ్డుకు ప్యాచ్‌వర్కులు చేయిస్తామని తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థను గ్రామంలో అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఏడాదికి ముందు ఉత్తమ పంచాయతీగా ఎంపికైన మిక్కిలింపేటకు రూ.కోటి నిధులు గ్రామాభివృద్ధికి వినియోగించకుండా వైకాపా నాయకులు పక్కదారి పట్టించారన్నారు. మండలానికి రూ.82 లక్షలు మంజూరయ్యాయని పలుచోట్ల అత్యవసర పనులు చేస్తున్నామన్నారు. ఈనెల 26 నుంచి తెదేపా సభ్యత్వ నమోదు ప్రారంభిస్తామని, విజయవంతం చేయాలని పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచి బుజ్జిరెడ్డి, తహసీల్దారు స్ఫూర్తి, తెదేపా నాయకులు అమరేంద్రరెడ్డి, శ్రీహరిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకయ్య, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు పాట్లు



ఇటీవల కురుస్తున్న వర్షాలకు కొన్ని రహదారులపై నీరు నిలిచి ఛిద్రమవుతున్నాయి. పొదలకూరు మండలం మహ్మదాపురంలోని ప్రధాన రహదారిపై వర్షపునీరు నిలిచి వాహనదారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆర్అండ్‌బి సహాయ ఇంజినీరు శ్రీనివాసులు మాట్లాడుతూ సైడు కాలువలు లేక నీరు రోడ్డుపైనే నిలుస్తోందని, సులువుగా నీరు వెళ్లేలా ఏర్పాటు చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, పొదలకూరు, బుచ్చి

పీకేపాడులో దాహం.. దాహం



మండల పరిధిలోని పడమటికంభంపాడు గ్రామంలోని శుద్ధజల ప్లాంట్ నాలుగు రోజుల క్రితం మరమ్మతులకు గురి కావడంతో స్థానికులు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. తాగునీటి కోసం సోమశిలకు వచ్చి తీసుకెళుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. దీనిపై సర్పంచి కత్తి లావణ్య మాట్లాడుతూ ప్లాంట్‌లో నీటి సరఫరా చేసే స్టార్టర్ మరమ్మతులకు గురైందని తెలిపారు. సోమవారం సాయంత్రంలోగా మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. – న్యూస్‌టుడే, అనంతసాగరం

తిక్కనకాలనీలో అంధకారం



కోవూరు మండలంలోని పాటూరు పంచాయతీలోని తిక్కన కాలనీకి వెళ్లే మార్గంలో ఉన్న విద్యుత్తు స్తంభానికి వీధి దీపం బిగించకపోవడంతో రాత్రుల్లో అంధకారంగా ఉంటుందని ప్రజలు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో పాములు సంచరిస్తుండటంతో భయంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఎంపీడీవో శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శికి చెప్పి వీధి దీపం ఏర్పాటు చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, కోవూరు

ఎంఈవో కార్యాలయంలో వెళ్లేదెలా..?



కోవూరులోని ఎంఈవో కార్యాలయం ఎదుట నీటి మడుగు ఏర్పడింది. ఇటీవల కురిసిన వర్షాలతో నీరు పేరుకుపోవడంతో కార్యాలయానికి వెళ్లేందుకు అధికారులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. నీరు బయటకు వెళ్లేమార్గాన్ని ఏర్పాటు చేయాలని లేదా ఇక్కడ రోడ్డును ఎత్తుగా చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఎంపీడీవో శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కోవూరు

సభ్యత్వ నమోదులో ముందుండాలి

కోవూరు, న్యూస్‌టుడే: తెదేపాలో సభ్యత్వ నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికి రూ.5 లక్షల భీమా వర్తిస్తుందని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. కనుపర్తిపాడులోని వీపీఆర్ కల్యాణ మండపంలో ఆదివారం కోవూరు నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నియోజకర్గంలోని పార్టీ మండల అధ్యక్షులు ఇంతా మల్లారెడ్డి, కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, వీరేంద్ర, బత్తల హరికృష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు ఈవోపీఆర్డీగా బాలకృష్ణయ్య

పొదలకూరు, న్యూస్‌టుడే: పొదలకూరు ఈవోపీఆర్డీగా బాలకృష్ణయ్యను నియమించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేస్తున్న దొరబాబు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఇనుకుర్తి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న బాలకృష్ణయ్యను ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీగా నియమిస్తూ ఎంపీడీవో నరసింహరావు ఉత్తర్వులు జారీ చేశారు..

తెదేపా నాయకుడికి పరామర్శ

కోవూరు, న్యూస్‌టుడే: పడుగుపాడుకు చెందిన తెదేపా నాయకులు మహేశ్‌రెడ్డిని నెల్లూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి ఆదివారం పరామర్శించారు. దాడి చేసిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

నేడు దివ్యాంగులు, వయోవృద్ధులకు ప్రత్యేక శిబిరం

తోటపల్లిగూడూరు, మనుబోలు, న్యూస్‌టుడే : తోటపల్లిగూడూరు మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం కేంద్ర ప్రభుత్వ సంస్థ కాపోజిట్ రీజనల్ కేంద్రం ఆధ్వర్యంలో దివ్యాంగులు, వయోవృద్ధులకు ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మూడు చక్రాల బండ్లు, వినికిడి యంత్రాలు, వీల్ ఛైర్లు ఇతర ఉపకరణాలను ఎంపిక చేసిన దివ్యాంగులకు అందజేస్తారన్నారు. సదరం ధ్రువీకరణ పత్రాలు, రేషన్, ఆధార్ కార్డులు తీసుకురావాలని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మర్రిపాడు: మండలంలోని బ్రహ్మణపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం రాత్రి ద్విచక్రవాహనదారుడు గేదెను ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాలమేరకు.. ప్రకాశం జిల్లా పామూరు పట్టణానికి చెందిన రామనబోయిన లక్ష్మీ నరసింహులు బద్వేలులో స్నేహితుని వద్దకు వచ్చారు. తిరిగి ఇంటికెళుతుండగా బ్రహ్మణపల్లి సమీపంలో రోడ్డుపై ఉన్న గేదెను ఢీకొన్నారు. ప్రమాదంలో లక్ష్మీ నరసింహులు తలకు తీవ్రగాయమైంది. ఉదయగిరి ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు, అక్కడి నుంచి తిరుపతికి తరలించారు.

పోలీసు అమర వీరులను స్మరించుకుందాం



రక్తదాన శిబిరంలో రాజగోపాల్‌రెడ్డి, పోలీసు అధికారులు

మనుబోలు, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులను ప్రతిఒక్కరం స్మరించుకుందామని నెల్లూరు గ్రామీణ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, సర్వేపల్లి నియోజకవర్గ తెదేపా సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఎస్సై రాకేశ్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సహకారంతో స్థానిక సీఆర్ఆర్ కల్యాణ మండపంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. మండలంలోని సుమారు 300 మందికి పైగా యువకులు తరలివచ్చి రక్తదానం చేశారు. అనంతరం బీసీకాలనీలో బాణసంచా పేలుళ్ల కారణంగా మంగమ్మ ఇల్లు దెబ్బతినడంతో ఎస్సై సొంత నిధులతో మరమ్మతులు చేయించారు. ఆ ఇంటిని డీఎస్పీ పరిశీలించి మంగమ్మతో మాట్లాడారు. కార్యక్రమంలో రక్తనిధి జిల్లా కన్వీనర్ అజయ్‌బాబు, సీఐ రాంబాబు, ఎస్సై రాకేశ్, ఏఎస్సైలు జిలానీబాషా, తిరుపాలు, రవిచంద్ర, తెదేపా మండల అధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, పచ్చిపాల రామిరెడ్డి, కిరణ్‌కుమార్, మధునాయుడు, వెంకటరమణయ్య, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత



సరకులు అందిస్తున్న తెదేపా నాయకులు

విడవలూరు, న్యూస్‌టుడే: ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చౌకచర్లలోని కట్ట వద్ద గిరిజనుల ఇళ్లలోకి వరద నీరు చేరింది. స్థానికంగా ఉన్న 15 కుటుంబాలకు తెదేపా నాయకులు బియ్యం, కంది పప్పు, చింతపండు, మిరపకాయులు, నూనె సరకులు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, కృష్ణవేణి, ఆరణి విజయమ్మ, ఈదూరు సురేష్, మిట్ట అంకయ్య, బద్దిపూడి సుధీర్, మద్దిల మల్లి పాల్గొన్నారు. అనంతరం ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్సై నరేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రత్యేక హోదా సాధనకు కృషి

తోటపల్లిగూడూరు, మనుబోలు, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ ప్రజా ఆత్మగౌరవ వేదిక జిల్లా అధ్యక్షుడిగా కోసూరు నారాయణను ఆదివారం నెల్లూరులో జరిగిన ఆత్మగౌరవ వేదిక సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని తోటపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచి కోసూరు నారాయణ అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షులుగా అన్నం సురేష్, పినిశెట్టి శ్రీహరి, ప్రధాన కార్యదర్శిగా పవర్‌కుమార్, సభ్యులుగా శ్రీనివాసులు, పి.శ్రీనివాసులు, కిషోర్‌లను ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యేక హోదా సాధనకు కృషి చేస్తామన్నారు. నాయకులు విజయ్, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం



యోగా కేంద్రంలో స్థానికులు

పొదలకూరు, న్యూస్‌టుడే : నిత్యం యోగా సాధన చేస్తే వ్యాధులు దరిచేరవని హరిద్వార్‌కు చెందిన త్విక్‌జీ మహారాజ్ అన్నారు. పొదలకూరు రామ మందిరం వీధిలోని నిర్మాలానంద స్వామి యోగా కేంద్రంలో అయిదు రోజులగా యోగాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. యోగా గురువు పెంచలయ్య, ఆనందరావుతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

నేడు రామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ



మనుబోలు, న్యూస్‌టుడే: బద్దెవోలులో వెలసిన కామాక్షిదేవి సమేత రామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం నిర్వహించనున్నట్లు ఆదివారం ఆలయ ఈవో తాతా శ్రీనివాసరావు తెలిపారు. వేద పండితులు నూతనపాటి సుబ్బయ్య శాస్త్రి ఆధ్వర్యంలో రుత్వికులు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా హోమాలు, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు.

వెంకటగిరి నియోజకవర్గ సమాచారం

పోలేరమ్మ ఘటోత్సవం



ప్రదర్శనగా వస్తున్న భక్తులు

సైదాపురం: సైదాపురం పట్టణ ప్రజల ఆరాధ్యదైవం..కొలిచిన వారికి కోరిన వరాలిచ్చే తల్లిగా విరాజిల్లుతున్న పోలేరమ్మ తల్లి జాతర వేడుకల్ని ఆదివారం ఘటోత్సవంతో ప్రారంభించారు. ఇక్కడి పోలేరమ్మ ఆలయం వద్ద ముందుగా ఘటానికి గ్రామ కులపెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రోజుల పాటు గ్రామంలోని అన్ని ఇళ్లకు వెళ్లి పసుపు, కుంకుమలతోపాటు సద్ది స్వీకరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సామూహిక పొంగళ్లు




మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

సైదాపురం: రాగనరామాపురం గ్రామంలో ఆదివారం సామూహిక పొంగళ్ల కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో వెలసిన అంకమ్మ, మహాలక్ష్మమ్మ, చెంగాళమ్మ దేవతలకు భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. చిత్తకార్తె మూడో ఆదివారం రోజున ఆయా దేవతలకు మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్థులు తెలిపారు. పలువురు బయట ప్రాంతాల్లో ఉన్నవారంతా రావడంతో స్థానికంగా సందడి నెలకొంది.

ఏకోపాధ్యాయ బడులకు సెలవు

పేదలకు విద్యనందించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు

న్యూస్‌టుడే, బుచ్చిరెడ్డిపాళెం, కొడవలూరు



వైకాపా పాలనలో విద్యావ్యవస్థ పూర్తిగా గాడితప్పింది... అస్తవ్యస్తమైన నిర్ణయాలతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. 1, 2, 3, 4, 5, 6, 7, 8, 9 ఇవన్నీ ఒకటో తరగతి చిన్నారులకు నేర్పించే సంఖ్యలు కాదు... ఏకోపాధ్యాయ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య. . మరికొన్ని చోట్ల విద్యార్థుల సంఖ్య 0 కావడంతో ఏకంగా పాఠశాలలు మూసేశారు. నాడు-నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని గత పాలకులు చెప్పినా అవన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. జీవో నెం.117 పాఠశాలలపై పిడుగులా మారింది. 3, 4, 5 తరగతుల విలీనంతో ఏకోపాధ్యాయ పాఠశాలలు పెరిగాయి. కిలోమీటరు దూరంలో ఉన్న పాఠశాలకు వెళ్లలేక పిల్లలు అవస్థలు పడ్డారు. నాటి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ఇబ్బందులు ఎదురయ్యాయి.

ప్రాథమికోన్నత పాఠశాలలకు గుదిబండ...

● ఆ జీవో ప్రకారం 98 కంటే తక్కువ విద్యార్థులున్న పాఠశాలల్లో ఎస్జీటీల నియామకం, స్కూల్ అసిస్టెంట్ల బదిలీతో ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6, 7, 8 తరగతులు చదువుతున్న విద్యార్థులకు అన్నీ సబ్జెక్టుల్లో అర్హత ఉన్న ఉపాధ్యాయులు అందుబాటులో లేకుండాపోయారు. విద్యార్థులు ఎక్కువ మంది ప్రైవేట్ పాఠశాలల్లో చేరారు.

● కోవూరు, సర్వేపల్లి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో గతంలో 80 వరకు ఉన్న ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉండగా.. వైకాపా తెచ్చిన జీవోతో సుమారు 320 వరకు ఏకోపాధ్యాయ పాఠశాలలయ్యాయి. ఇక్కడ ఉపాధ్యాయులు సెలవు పెడితే సీఆర్ఎంటీలు, పక్కనున్న పాఠశాల ఉపాధ్యాయులు వెళ్లాల్సిన పరిస్థితి. ఉపాధ్యాయుల సెలవులతో పాఠశాలలు మూతపడకుండా నడపడం ఎంఈవోలకు కంటిమీద కనుకులేకుండా చేస్తోంది. వచ్చే విద్యాసంవత్సరం నుంచి జీవో రద్దుకానుందని కూటమి ప్రభుత్వం ప్రకటించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● బుచ్చి ఎంఈవో దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ఏకోపాధ్యాయ పాఠశాలలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఉపాధ్యాయులు సెలవుపై వెళ్లినపుడు సీఆర్ఎంటీలను డిప్యుటేషన్‌పై పంపిస్తున్నామని, ప్రభుత్వ నిర్ణయాన్ని అనుసరించి పాఠశాలల్లో బోధకులను సర్దుబాటు చేస్తామన్నారు.


గంధ మహోత్సవంలో ముస్లిం సోదరులు

వైభవంగా గంధ మహోత్సవం

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నగరంలోని బారాషహీద్ దర్గా ఆవరణలోని గౌస్-ఏ-పాక్ మహబూబ్ సుభహాని నిషాన్ గంధ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాత్రి పకీర్ల జరుబులు, మేళతాళాల మధ్య అలంకరించిన ప్రత్యేక వాహనంలో గంధాన్ని ఉంచి పొదలకూరు రోడ్డు, అంబేడ్కర్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఊరేగించి దర్గాకు తీసుకొచ్చారు. మత పెద్దలు ప్రార్థనలు నిర్వహించి భక్తులకు పంచి పెట్టారు. గంధాన్ని తిలకించేందుకు నెల్లూరు నగరంతో పాటు పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో దర్గా కన్వీనర్ ఎస్కే గౌస్‌బాషా, భక్తులు పాల్గొన్నారు.

నెల్లూరు

• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం


బహుమతులు అందుకున్న చిన్నారులు

అలరించిన సాంస్కృతిక నృత్య పోటీలు

నెల్లూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే: నగరంలోని టౌన్‌హాల్‌లో నెల్లూరు కల్చరల్ అసోసియేషన్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సాంస్కృతిక నృత్య పోటీలు అలరించాయి. పలువురు చిన్నారులు చక్కటి ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. నిర్వాహకులు బీరంగుంట శ్రీనివాసులు ఆధ్వర్యంలో సాయంత్రం ముఖ్య అతిథులు విజేతలకు బహుమతులు అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా! (10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: శివగిరి కాలనీలోని 6, 7 వీధుల్లో అయిదు స్తంభాలకు విద్యుద్దీపాలు వెలగడం లేదు. సాయంత్రం దేవస్థానాలకు వెళ్లేందుకు మహిళలు అవస్థలు పడుతున్నారు. -శ్రీనివాసులు

సమాధానం: విద్యుద్దీపాలు వెలిగేలా చర్యలు చేపడతాం. - సూర్యతేజ, కమిషనర్

? వనంతోపులో కాలువలు పూడికతో నిండిపోయాయి. మురుగునీరు ముందుకు కదలడం లేదు. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. చర్యలు తీసుకోవాలి. - సావిత్రమ్మ

✓ కాలువల్లో పూడిక తీయిస్తాం. - డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

- న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ)

కఠినంగా శిక్షించాలి

నెల్లూరు (విద్య): బాలికల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్న వారిని శిక్షించాలని నూర్ బాషా సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి షేక్ సలీం కోరారు. ఆదివారం నగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప జిల్లా బద్వేలులో ప్రేమోన్మాది చేతిలో గాయపడి మృతి చెందిన యువతికి నివాళులర్పించారు. రాష్ట్ర గౌరవ సలహాదారు బాబాన్, కోశాధికారి దస్తగిరి, మహిళా ఉపాధ్యక్షురాలు షేక్ పర్వీన్, మహ్మద్ బాషా, షరీఫ్, నాగూర్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

గుంటూరు, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టైపిస్టులు, స్టెనోగ్రాఫర్ల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం గుంటూరులోని జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో జరిగాయి. కార్యవర్గ వివరాలివీ. రాష్ట్ర అధ్యక్షుడిగా జి. మోహన్‌గోపాలకృష్ణ (రాష్ట్ర సచివాలయం), ప్రధాన కార్యదర్శిగా బి.సి.శంకర్‌నాయక్ (కర్నూలు జిల్లా) కోశాధికారిగా బి.సురేష్‌బాబు (ప్రకాశం), సహాధ్యక్షుడిగా ఏసుబాబు (కృష్ణా), ఉపాధ్యక్షులుగా బి.చిన్నారావు (పశ్చిమ గోదావరి), బి.బ్రహ్మానందరెడ్డి (కర్నూలు), వి.చంద్రశేఖర్ (గుంటూరు), మహమ్మద్ జాకిర్ (అనంతపురం), కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎస్ ఎస్‌కే శర్మ (నెల్లూరు), జి.ప్రాణేష్‌రావు (అనంతపురం), వి.రామకృష్ణ (కృష్ణా), కె.మురళి (ప్రకాశం), కార్యదర్శులుగా కె.అరుణ్‌కుమార్ (శ్రీకాకుళం), జి.మహమ్మద్ అలీ (కర్నూలు), ఎస్.కె.నజీర్ మహమ్మద్ (గుంటూరు), ఎం.సుధాకర్ (చిత్తూరు) ఎన్నికయ్యారు. క్రీడా కార్యదర్శిగా యు.ప్రవీణ్‌కుమార్ (వైఎస్ఆర్), మహిళా ప్రతినిధులుగా వాణిశ్రీ, దీప (గుంటూరు)లను ఎన్నుకున్నారు.

సేవా బృందం.. ఆపన్నులకు అభయం


సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా చేతి పంపునకు మరమ్మతులు

న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ)

వారంతా యువకులు.. వివిధ వృత్తులు.. వ్యాపారాల్లో కొనసాగుతున్నారు. ప్రార్థించే పెదవుల కన్నా.. సాయం చేసే చేతులు మిన్న అన్న మదర్‌థెరెసా మాటలను స్ఫూర్తిగా తీసుకున్నారు. నిరుపేదలు, అనాథలకు చేయూత అందించడమే లక్ష్యంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. పండగలు, ప్రత్యేక సందర్భాలు, విపత్తుల్లో సేవలు కొనసాగిస్తున్నారు నగరంలోని జెండా వీధికి చెందిన షేక్ ఖాలిద్‌తో పాటు 12 మంది యువకులు. వీరు 2015లో జిల్లా ముస్లిం యూత్ సేవా సంస్థను స్థాపించారు. సంపాదించిన సొమ్ములో నెలానెలా కొంత మొత్తాన్ని సంస్థకు అందిస్తున్నారు. దీనికి దాతల సహకారం తోడైంది. వీటితో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.

చేపట్టిన కార్యక్రమాలు

● పర్యావరణ పరిరక్షణకు నగరంలోని కాలనీల్లో మొక్కలు నాటి, ట్రీగార్డులు ఏర్పాటు ● ఎయిడ్స్ బాధితుల ఆదరణ కేంద్రం, వృద్ధాశ్రమాలు, అనాథ శరణాలయాలకు నిత్యావసర సరకుల వితరణ ● కరోనా సమయంలో రోజూ రోడ్డు పక్కన, బస్టాండ్లలో యాచకులు, నిరుపేదలకు భోజనం ప్యాకెట్లు సరఫరాతో ఇళ్లలో ఉన్న వారికి కూరగాయలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దాదాపు రూ.5 లక్షల వరకు ఖర్చు చేశారు. వీరి సేవలను గుర్తించిన అడ్వకేట్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ, అవేర్‌నెస్ సంస్థ ప్రశంసాపత్రాన్ని అందించింది. ● సంస్థ సభ్యులు స్నేహితుల పుట్టిన రోజు, పెళ్లి రోజు, శుభకార్యాల సమయంలో ప్రభుత్వాసుపత్రుల్లో అన్నదానం, పండ్లు, రొట్టెల పంపిణీ చేస్తున్నారు. ● స్వాతంత్ర్య సమరయోధుల జయంతులు, వర్ధంతుల నిర్వహణ ● విద్యార్థులకు పుస్తకాలు, అట్టలు, జామెట్రీ బాక్సులు, పెన్నుల పంపిణీ ● చలికాలంలో రోడ్లపై నిద్రిస్తున్న నిరుపేదలు, యాచకులకు దుప్పట్లు, దుస్తులు అందజేత ● తుపానులు, విపత్తుల సమయంలో సభ్యులంతా కలిసి జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనదారులు, వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు అన్నదానం చేశారు.


పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

చేయూత అందించడమే లక్ష్యం



- షేక్ ఖాలిద్, జిల్లా ముస్లిం యూత్ సేవా సంస్థ అధ్యక్షులు

సమాజంలోని అనాథలు, నిరాశ్రయులు, పేద విద్యార్థులకు చేయూత అందించడమే లక్ష్యంగా ముస్లిం యూత్ సేవా సంస్థ సభ్యులమంతా పనిచేస్తున్నాం. కులమతాలకతీతంగా సేవలు చేపడుతున్నాం. ప్రజల సమస్యలు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళుతున్నాం. ముందుముందు మరిన్ని చేస్తాం.


2.0లో రిజిస్ట్రేషన్లు.. సేవల్లో జాప్యం



జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం

నెల్లూరు (బృందావనం), న్యూస్‌టుడే: కార్డ్ రద్దుతో రిజిస్ట్రేషన్లలో లావాదేవీలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం గతంలో అమలులో ఉన్న దీన్ని ఈ నెల అయిదో తేదీ రద్దు చేసింది. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2.0 విధానం ద్వారా కార్యకలాపాలు సాగించాలని అధికారులను ఆదేశించింది. ఇందులో ఈసీలు తీసుకోవడంతో పాటు మార్పులకు వీలు కావడం లేదు. నిషేధిత జాబితాలో ఉన్న భూముల సర్వే నంబరు వేయాలన్నా శ్రమించాల్సి వస్తోంది. మాన్యువల్ విధానంలో ఇచ్చే స్టాంపులు కొనుగోలు చేసిన కక్షిదారుడి వివరాలు నమోదు కూడా కష్టమవుతోంది. మరోవైపు స్టాంపులపై రిజిస్ట్రేషన్లకు కూడా ప్రాధాన్యమిస్తున్నారు. దీంతో వీటికి కొరత ఏర్పడింది. దీన్ని ఆసరాగా తీసుకున్న స్టాంపు వెండర్లు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్ముతున్నారు.

స్టాంపులు తెప్పిస్తున్నాం



- వర్మ, జిల్లా రిజిస్ట్రార్

ప్రభుత్వం మాన్యువల్ స్టాంపులతో రిజిస్ట్రేషన్‌కు ప్రాధాన్యమివ్వడంతో కొరత ఏర్పడింది. ఈనేపథ్యంలో రూ. 15 లక్షల విలువైన స్టాంపులను తెప్పిస్తున్నాం. వచ్చే వారంలో ఇవి రానున్నాయి. నిర్ణీత రుసుము కన్నా ఎక్కువ వసూలు చేయరాదని జిల్లాలో స్టాంపు వెండర్లను హెచ్చరిస్తున్నాం. సర్వర్ పనిచేయకపోవడంతో ఈసీల జారీలో ఇబ్బందులు వచ్చాయి. ఇది రాష్ట్ర వ్యాప్తంగా ఉంది. 2.0 విధానం అమలులో ఇబ్బందులను ప్రభుత్వం ఇప్పటికే గుర్తించింది. నాలుగు రోజుల్లో పరిష్కారం లభిస్తోంది.

ఈమార్గంలో వెళ్లేదెలా?

నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్ నుంచి ఆత్మకూరు బస్టాండుకు వెళ్లే మార్గం దారుణంగా తయారైంది. కోవూరు వైపు నుంచి వచ్చే ద్విచక్ర వాహనాలు, ఆటోలు బస్టాండుకు వెళ్లాలంటే ఇదే మార్గం. గుంతలు పడి దారుణంగా తయారైంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, నెల్లూరు



పైపులింతేనా?



మంచినీటి పథకానికి ఉపయోగించే రూ.లక్షల విలువైన సిమెంట్ పైపులను అధికారులు నిర్లక్ష్యంగా పడేశారు. మహేశ్వరినగర్ పరిధిలోని ఓ ఖాళీస్థలంలో వేశారు. ఇటీవల కురిసిన వర్షపు నీరు వీటి చుట్టూ చేరింది. దీంతో ఎండా వానలతో పనికిరాకుండా పోతాయని ప్రజలు భావిస్తున్నారు. ఆ శాఖ అధికారులకు సమాచారం అందిస్తామని హెల్త్ విభాగం అధికారి చైతన్య తెలిపారు. - న్యూస్‌టుడే, నెల్లూరు (జడ్పీ)

మలుపులో ప్రమాదమే

నెల్లూరు నగరంలోని పలు రోడ్లు భారీ గుంతలతో దర్శనమిస్తున్నాయి. ముత్తుకూరు రోడ్డు నుంచి బైపాస్‌కు వెళ్లే రోడ్డు గుంతలతో ప్రమాదకరంగా తయారైంది. ముత్తుకూరు పోర్టు, పలు కంపెనీల నుంచి వస్తున్న భారీ వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయి. మలుపు వద్ద భారీగా గుంతలు పడ్డాయి. చిన్నపాటి వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య)



మురుగుమయం




నగరంలోని వ్యాపారకూడలైన చిన్నబజారు నుంచి మండపాల వీధికి వెళ్లే మొదట్లో ప్రజలు వినియోగించుకునేందుకు వీలుగా గతంలో నగరపాలక సంస్థ మరుగుదొడ్లు ఉండేవి. ప్రస్తుతం అవి కనిపించడం లేదు. నిత్యం వ్యాపార పనుల నిమిత్తం ఆ ప్రాంతాలకు వచ్చే వారు మూత్రవిసర్జనకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. వీధిలో నిత్యం మురుగునీరు ప్రవహిస్తోంది. స్థానికులు చెత్త అక్కడే వేయడంతో అపరిశుభ్రంగా ఉంటుంది. - న్యూస్‌టుడే, నెల్లూరు(రంగనాయకులపేట)

విద్యుద్దీపాల పర్యవేక్షణ ఎక్కడ?

నెల్లూరు పెద్దబజారు బారకాసు సెంటరు నాలుగు కూడళ్ల రోడ్డులోని సెంట్రల్ లైటింగ్ వెలగడం లేదు. రోడ్డు మధ్యలో నలువైపులా వెలుగునిచ్చేలా విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. అవి గత వారం రోజులుగా వెలగకపోవడంతో చీకటి నెలకొంది. అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ సూర్యతేజ తెలిపారు.

- న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)



సౌత్‌మోపూరులో కాలువ పనులకు శంకుస్థాపన

నెల్లూరుగ్రామీణం, న్యూస్‌టుడే: నెల్లూరు రూరల్ మండలం సౌత్‌మోపూరు గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. రూ.20 లక్షలతో కాలువ పనులకు తెదేపా నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బూడిద విజయ్ కుమార్, సర్పంచి తిరివీధుల పోలయ్య, పరువురు నాయకులు పాల్గొన్నారు.



ఎం-1 సినిమాస్- స్క్రీన్1.. విశ్వం, స్క్రీన్-2.. దేవర, స్క్రీన్3.. వెట్టయ్యాన్, స్పైస్‌సినిమాస్(ఎంజీబీ మాల్)- స్క్రీన్1.. వెట్టయ్యాన్, స్క్రీన్2..జనక ఐతే గనక, స్క్రీన్3..ది వైల్డ్ రోబోట్, స్క్రీన్4..విశ్వం, స్క్రీన్5..దేవర, రెయిన్‌సినిమాస్-స్క్రీన్1..దేవర, దివైల్డ్ రోబోట్, విశ్వం, స్క్రీన్2..విశ్వం, దేవర, స్క్రీన్3..వెట్టియ్యాన్, స్క్రీన్4..విశ్వం, లవ్‌రెడ్డి, సిరిమల్టీప్లెక్స్..స్క్రీన్1..దేవర, స్క్రీన్2.. వెటయ్యాన్, విశ్వం స్క్రీన్3..విశ్వం, వెట్టయ్యాన్, స్క్రీన్4.. జనక అయితే గనక

రహదారులు ఛిద్రం


టక్కెమిట్ట ప్రధాన రోడ్డులో గుంతలు

నగరంలో రహదారులకు చేసిన మరమ్మతులు వర్షాలకు కొట్టుకుపోయాయి. యథాప్రకారం గుంతలు తేలాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నగరంలోని రహదారులకు మరమ్మతులు చేయించారు. గుంతలన్నీ పూడ్చారు. ఇటీవల నాలుగురోజుల పాటు కురిసిన వర్షాలకు మళ్లీ గుంతలు పడ్డాయి. మరమ్మతులు చేసిన చోట కంకర లేచిపోయింది. దీంతో రూపుకోల్పోయాయి. ఇవి నీటితో నిండిపోయాయి. ఎక్కడ గుంత ఉందో తెలియక ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. వేదాయపాలెం నుంచి ఆత్మకూరు బస్టాండ్ వరకు, ఫత్తేఖాన్‌పేట, టక్కెమిట్ట, మూలాపేట, సంతపేట, నవాబుపేట ఇలా ఎక్కడ చూసినా గోతులు కనిపిస్తున్నాయి. - న్యూస్‌టుడే, నెల్లూరు (జడ్పీ)


వేదాయపాలెం సమీపాన రూపు కోల్పోయిన రోడ్డు

మద్యం దుకాణం ఏర్పాటుపై మహిళల ఆందోళన


ఆందోళన వ్యక్తం చేస్తున్న మహిళలు

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దని మైపాడు రోడ్డు ప్రాంతంలో మహిళలు ఆదివారం ఆందోళన చేశారు. ఇక్కడ ఏర్పాటు చేస్తే ఊరుకునేది లేదంటూ హెచ్చరించారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా 182 దుకాణాలకు లక్కీ డ్రా వేసిన విషయం తెలిసిందే. నగరంలో 30 దుకాణాలు ఉన్నాయి. అనుమతి వచ్చిన వారు ఇక్కడ ఏర్పాటుకు యత్నిస్తున్నారు. ఇది తెలుసుకున్న మహిళలు ధర్నా చేశారు.

ఎముకల దృఢత్వంపై అవగాహన

నెల్లూరుగ్రామీణం: కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆస్టియోపొరాసిస్ డేను పురస్కరించుకుని ఆదివారం ఆమంచర్లలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు పి.అశ్వినీకుమార్ మాట్లాడుతూ ఎముకలు ఆరోగ్యంగా ఉండేందుకు క్రమం తప్పకుండా వ్యాయామంతో పాటు మంచి పోషకాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌పీ నాయకులు జయప్రకాష్, శాఖవరపు వేణుగోపాల్, శేషయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చినుకుపడితే చింతే!

జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ఇబ్బందులు


కార్యాలయం ముందు నీరు

న్యూస్‌టుడే, నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)

వర్షాలు కురిస్తే నగరంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం ఆవరణలో పెద్దఎత్తున నీరు నిలిచి బురదమయంగా మారుతోంది. దీంతో ఉద్యోగులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ కార్యాలయం పరిధిలో 200 మంది వరకు పనిచేస్తుంటారు. రోజువారీ కార్యకలాపాల నిమిత్తం విధుల నిర్వహణకు వచ్చే వారితో పాటు ఆ శాఖకు సంబంధించి పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, హెల్త్ సెంటర్లు తదితర వాటిల్లో పనిచేసే ఉద్యోగులు వివిధ పనులకు వస్తుంటారు. వర్షాకాలంలో నీరు నిలిచిపోవడంతో వీరంతా అవస్థలు పడుతున్నారు.

తడుస్తోన్న మందులు: కార్యాలయం భవనం గ్రౌండ్‌ఫ్లోర్‌లో పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు తదితర వాటికి సరఫరా చేసే మందులు, వివిధ కార్యక్రమాలకు సంబంధించి ప్రచార కరపత్రాల పెట్టెలు భద్రపరిచారు. వర్షం కురిస్తే కప్పు నుంచి నీరు కారుతోంది. ఇవన్నీ తడిసిపోతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయం ముంగిట నీరు నిల్వకుండా చేయాలని సిబ్బంది కోరుతున్నారు.


భవనంలో తడుస్తున్న మందులు తదితర వస్తువులు

గేదెలు తోలేందుకు చెరువులో దిగి మృతి

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: చెరువులో దిగిన గేదెలను బయటకు తోలేందుకు దిగిన వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం వేదాయపాలెం పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు గ్రామీణ మండలంలోని ఓగూరుపాడుకు చెందిన గోర్ల కృష్ణారెడ్డి (53) గేదెలను మేపి పాల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీటిని బయట ప్రాంతాల్లో మేపుతుంటారు. ఆదివారం మేపేందుకు గంగుంట చెరువు దగ్గరకు తోలుకెళ్లారు. అక్కడ చెరువులో దిగగా బయటకు తోలేందుకు కృష్ణారెడ్డి దిగారు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందారు. సమీపంలో ఉన్న మహేంద్ర, శీనయ్య గమనించి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి కుమారుడు శివకుమార్‌రెడ్డి వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నగరం.. సమస్యల వలయం

న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

నగరం దినదినాభివృద్ధి చెందుతోంది. సుందరీకరణకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. కానీ చిన్నచిన్న సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ప్రజలను చికాకు పుట్టిస్తున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు వీటిపై దృష్టి పెడితే పరిష్కారమవుతాయి.

వ్యాధుల భయం

మనుమసిద్ధినగర్ ప్రధాన రోడ్డుపై భారీగా వర్షపు నీరు చేరింది. ఖాళీ స్థలంలో నుంచి నీరు రోడ్డు మధ్యలోకి వచ్చింది. అదే స్థలంలో వ్యర్థాలు కూడా వేస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. వ్యర్థాలను పశువులు తింటున్నాయి. దోమలు ఉద్ధృతమవుతున్నాయి. ప్రధాన రోడ్డుపై రాకపోకలు సాగించే వారు అవస్థలు పడుతున్నారు. వ్యాధులు ప్రబలుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.



ఆరు నెలలకే రాళ్లు తేలి

మాగుంట లేవుట్‌లోని సైన్స్ పార్కు రోడ్డు రాళ్లు తేలింది. ఎన్నికలకు ముందు ఆరు నెలల క్రితం సిమెంటు రోడ్డు నిర్మించారు. గుత్తేదారుడు నాసిరకంగా నిర్మించడం, నిబంధనలు పాటించకపోవడంతో వర్షాలకు కంకర తేలింది. రాత్రిళ్లు ద్విచక్రవాహన చోదకులు జారిపడి గాయపడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



కమ్మేసిన ముళ్ల చెట్లు



నగరం నడిబొడ్డున కోటమిట్ట మెక్లిన్స్ రోడ్డు బిలాల్ మసీదు వద్ద ముళ్ల చెట్లు రోడ్డుపైకి రావడంతో రాకపోకలకు ఆటంకంగా మారింది. ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలం ముళ్ల చెట్లు, వ్యర్థాలతో నిండిపోయింది. స్థల యజమాని పట్టించుకోకపోవడంతో వీటి కొమ్మలు రోడ్డుని కమ్మేశాయి. ద్విచక్రవాహనదారులు, పాదచారులకు తగులుతున్నాయి. అధికారులు స్పందించి రోడ్డుకు అడ్డుగా ఉన్న ముళ్ల చెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

రాకపోకలకు ఇక్కట్లు

నెల్లూరు రూరల్ మండలం దేవరపాలెం వద్ద రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. భారీ వర్షాలకు మోకాలి లోతు గుంతలు పడ్డాయి. దీనిపై ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మూడేళ్లుగా ఇదే పరిస్థితి ఉండడంతో ప్రజలు హడలిపోతున్నారు. గుంతల్లో పడి గాయపడుతున్నారు. దేవరపాలెం నుంచి ములుమూడి వరకు పునర్నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



పొదుపు సభ్యులకు ప్రత్యేక గుర్తింపు

న్యూస్‌టుడే, నెల్లూరు(కలెక్టరేట్)



నెల్లూరు రూరల్ మండలానికి చెందిన కొంతమంది సభ్యులు రెండు, మూడు సంఘాల్లో సభ్యత్వం పొందారు. గత ప్రభుత్వ హయాంలో ఆసరా పథకం కింద అదనపు లబ్ధిపొందారు. స్థానికంగా వచ్చిన ఫిర్యాదుతో అధికారులు విచారించగా.. నిజమని తేలింది. ఆధార్ నంబరు సీడింగ్‌తో ఒకే సంఘంలో ఉంచారు.

● నెల్లూరు అర్బన్ ప్రాంతానికి చెందిన సభ్యురాలు మెప్మా పరిధిలో ఉన్నారు. మరో వైపు కోవూరు మండలంలోని ఓ గ్రామం నుంచి పొదుపు సంఘ సభ్యురాలిగా కొనసాగుతున్నారు. ఆధార్ సీడింగ్‌తో ఈ వ్యవహారం బయటపడింది.

● గత ప్రభుత్వ హయాంలో పొదుపు సంఘాలు నిర్వీర్యమయ్యాయి. సంఘాల తీరు, సభ్యుల వివరాలను పూర్తిస్థాయిలో తెలుసుకోలేకపోయారు. కొందరు రెండు, మూడు సంఘాల్లో కొనసాగేవారు. ఇంకొందరు గ్రామీణంతో పాటు మెప్మా పరిధిలోనూ ఉండేవారు. దీంతో పలు అవకతవకలు చోటు చేసుకున్నాయి. పలువురు వీవోఏలు, సీసీలు నగదును పక్కదారి పట్టించేవారు. ఈ పరిస్థితికి అడ్డుకట్ట వేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

ఐడీతో అవకతవకలకు అడ్డుకట్ట

రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాలు, సభ్యులకు ప్రత్యేక గుర్తింపునిస్తూ డిజిటల్ నంబర్లను కేటాయించాలని నిర్ణయించింది.

ఉపయోగాలెన్నో..

జిల్లాలో 54,593 సంఘాలు ఉన్నాయి. వాటిలో సుమారు అయిదు లక్షలకు పైగా సభ్యులున్నారు. ఇప్పటివరకు వీరికి మాన్యువల్ ఐడీ ఉంది. 18 అంకెలతో కూడిన ఐడీ కేటాయించారు. ఈ కోడ్ రూపంలో రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ సంఘం సూచికలు ఉంటాయి. ఏపీఎం లాగిన్ ద్వారా చేర్పులు, మార్పులకు అవకాశం కల్పించేవారు. ఇకనుంచి ఐడీని డిజిటల్‌లోకి మార్చనున్నారు. ఆ నంబరు పరిధిలోనే సంఘంలోని సభ్యులంతా ఉంటారు. దీంతో ఇతర గ్రూపుల్లో చేరేందుకు వీలుండదు. ఈ క్రమంలో నకిలీ సంఘాలకు అడ్డుకట్ట పడనుంది.

● అవకతవకలు జరగకుండా చూస్తున్నామని, డిజిటల్ ఐడీలు వస్తే ఇబ్బంది ఉండదని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి తెలిపారు.